RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily

అనకాపల్లి | సంపుటి: 2 | సంచిక: 183 | శుక్రవారం | 6-12-2024 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00





# యువతకు నైపుణ్య శిక్షణ

## కోసం గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

### - మంత్రి లోకేష్ సమక్షంలో సంతకాలు



అమరావతి: విద్య, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులు, డెవలపర్లకు ఎఐ ఆధారిత నైపుణ్యాల కోసం 10 వేల మందికి ఎసెన్సిషియల్ పేరుతో గూగుల్ నైపుణ్య కోర్సు అందించనుంది. ఈ అంశంపై గూగుల్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. గూగుల్ క్లౌడ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ బిక్రమ్ సింగ్ బేడీ, ప్రభుత్వం నుంచి రియల్ టైం గవర్నెన్స్ శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. అంతర్జాతీయంగా ఎఐ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో గూగుల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఈ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. యువతకు ఎఐ ఆధారిత భవిష్యత్ అవకాశాలను కల్పించేందుకు గూగుల్ సంస్థ రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందని మంత్రి లోకేష్ అన్నారు. ఎఐ రంగంలో రాష్ట్రం దూసుకుపోవడంతో పాటు యువతకు అంతర్జాతీయస్థాయి నైపుణ్య శిక్షణ లభిస్తుందని, తద్వారా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పరిపాలన వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకుంటున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి తెలిపారు. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇడిబి సిఇవో సాయికాంత్ వర్మ, ఆర్‌టిజిఎస్ సిఇవో దినేష్‌కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పెట్టుబడుల విభాగం ఉన్నతాధికారి యువరాజ్ పాల్గొన్నారు.

# పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్ ప్రయోగం విజయవంతం

### - నింగిలోకి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఉపగ్రహాలు




సూళ్లూరుపేట: అంతరిక్షంలోకి మరో అద్భుత రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో 61వ రాకెట్‌ను ఇస్రో ప్రయోగించింది. పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్‌ను శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి గురువారం సాయంత్రం 4.12 గంటలకు ప్రయోగించారు. ఇంతకుముందు ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్-1కు తోడుగా ప్రస్తుతం ప్రోబా-3 పరిశోధనలు చేపట్టనుంది. సూర్యుని బాహ్య వలయంలోని కరోనా పొరను అధ్యయనం చేయడం, అవసరమైతే కృత్రిమ సూర్య గ్రహణాలు కూడా ఏర్పాటు చేసి సూర్యుడి గుట్టును రట్టు చేసేందుకు ఈ ప్రోబా-3ని అత్యంత ఆధునిక ఉపకరణాలతో నిర్మించారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3లో రెండు ఉప్రగహాలున్నాయి. పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్‌ను చాలా కాలం తర్వాత ఆరు స్ట్రాపాన్ బూస్టర్లతో నిర్మించారు. ప్రయోగ సమయంలో 44.5 మీటర్ల ఎత్తు, 320 టన్నుల బరువు కలిగిన ఈ రాకెట్ 550 కిలోల బరువు ఉన్న ప్రోబా-3లోని రెండు స్పేస్ క్రాఫ్టలను మోసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడం పట్ల శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారమే ఈ రాకెట్‌ను ప్రయోగించాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో వాయిదాపడింది.

# పరవాడ సబ్ డివిజన్ కార్యాలయంను సందర్శించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా





పరవాడ పెన్ సత్తా డిసెంబర్ 05: వార్షిక తనిఖీల్లో భాగంగా పరవాడ సబ్ డివిజన్ కార్యాలయం ను సందర్శించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా. గురువారం స్టేషన్ తనిఖీకి వచ్చిన ఎస్పీ కి సబ్ డివిజన్ డిఎస్పీ కె.వి. సత్యనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, వృద్ధుల సమస్యలను సానుకూలంగా విని వాటిని సామరస్యంగా పరిష్కరించేలా అధికారులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. ఫోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, పరిశ్రములలో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో జరిగే తీవ్రమైన కేసుల ఆరా తీశారు. ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు. పెండింగ్ కేసులలో విచారణ వేగం పెంచి, త్వరితగతిన కోర్టుకు నివేదించాలా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలను సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బ్యాంకులు ఏటీఎం ల వద్ద, ముఖ్య కూడళ్ళ వద్ద సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసేలా ప్రజలకు ఇతర వ్యాపార సంస్థలకు అవగాహన కల్పించాలన్నారు. నిఘాను ముమ్మరం చేయడంలో భాగంగా మహిళా సంరక్షణ కార్యదర్శుల వారి పరిధిలో గ్రామాల్లో జరిగే సమాచారం పై చర్యలు చేపట్టాలని, అలాగే స్కూల్స్‌లో మహిళా చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర విద్యార్థులకు అవగాహన కల్పించేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. సబ్ డివిజన్ కార్యాలయ ఉన్న రికార్డులను తనిఖీ చేసి, బ్యాడ్ క్యారెక్టర్ వ్యక్తులపై నిఘా కొనసాగించాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు, రవాణా జరిగే మార్గాలలో ఆకస్మిక, డైనమిక్ తనిఖీలు నిర్వహించేలా అధికారులను అప్రమత్తం చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని, రోడ్డు భద్రతా నియమాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు సబ్ డివిజన్ పరిధిలో విస్తృతం చేయాలన్నారు. ఈ తనిఖీలు నిర్వహించిన సమయంలో పరవాడ సిబ్బంది హాజరు గా ఉన్నారు.



# సమస్యలు తలెత్తకుండా కొనుగోలు ప్రకియను పూర్తి చేయాలి

### - ధాన్యం కొనుగోళ్లపై సిఎం చంద్రబాబు ఆదేశం




అమరావతి: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడితే దానికి కారణమైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా సమస్యలు తలెత్తకుండా కొనుగోలు ప్రకియను పూర్తి చేయాలని చెప్పారు. అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం, రైస్‌మిల్లర్ల సహాయ నిరాకరణ వల్ల రైతులు ఇబ్బంది పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..గత ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలు అమ్ముకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశామని, అందుకే ఈ సారి ధాన్యం కొనుగోళ్లలో సమూల మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఈ విధానాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కింద స్థాయి ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బందిపై ఉందని ఆయన పేర్కొన్నారు. డ్రైయ్యర్లు ( ధాన్యం ఆరబెట్టే యంత్రాలు) ఏర్పాటు ద్వారా తేమ విషయంలో తలెత్తుతున్న సమస్యలను అధిగమించవచ్చన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, నేటి వరకు 1.51లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,331 కోట్లు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ జరిగిందని, ఈ ఏడాది ఇప్పటికే 10.59 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుతో రికార్డు సాధించినట్లు సిఎం తెలిపారు.

ధాన్యం అమ్మే రైతులు ఏ మిల్లుకైనా ధాన్యం పంపించవచ్చని, గతంలో ప్రభుత్వం సూచించిన మిల్లులకు మాత్రమే రైతుల ధాన్యం పంపాల్సి ఉండేదన్నారు.

బియ్యం స్మగ్లింగ్‌ను సహించం.... రాష్ట్రంలో రేషన్ బియ్యం రీ సైక్లింగ్,స్మగ్లింగ్ అనేది పెద్దమాఫియాగామారిపోయిందని, అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని సిఎం స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం కోసం అధికారయంత్రాంగం ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్,మంత్రులు నాదెండ్ల మనోహర్, కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

# డిసెంబర్ 7 న మెగా పేరెంట్స్ మీటింగ్

# తల్లిదండ్రులు తప్పక పాల్గొనాలి

### - జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి పెన్ సత్తా డిసెంబరు 5: డిసెంబర్ 7 న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో పత్రిక విలేఖరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు మంత్రులు, శాసనసభ్యులు, అందరు ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులే స్వయంగా తయారుచేసిన ఆహ్వాన పత్రికలను అందజేసి ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ సమావేశాలలో విద్యార్థి యొక్క విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం గూర్చి తల్లిదండ్రులతో చర్చించడం జరుగుతుందన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న కార్యక్రమమని అందరూ సహకరించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం జరుగుతుందని, మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య సుహృద్భావ వాతావరణ%శీ% ఏర్పడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల మంచి భవిష్యత్తుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్, వాలీ బాల్, టెన్ని క్రైట్ తదితర ఆటలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు కార్యక్రమ వ్యాఖ్యాతగా (యాంకర్) వ్యవహరిస్తారని చెప్పారు.

# రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మనోహర్





అనకాపల్లి పెన్ సత్తా డిసెంబర్ 5: మండలం లోని కొత్తూరు జంక్షన్ వద్ద 2 కోట్ల 70 లక్షలతో వివిధ రోడ్లు పనులకు అభివృద్ధి కోసం శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలిసి పాల్గొన్నారు. అనకాపల్లి వచ్చిన మంత్రి కి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ లు నాదెండ్లకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్ నాయకులు, అధికారులతో కలిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి, శిలాఫలకాలను ప్రారంభించారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదు

చోడవరం పెన్ సత్తా డిసెంబర్5: రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసామని ప్రముఖ నిర్మాత నట్టి కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... మండలంలోని వెంకన్న పాలెం గ్రామంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతుందని, దీనిపై అనకాపల్లి డిఎస్పికి ఫిర్యాదు చేశానని కాకినాడ పోర్టుకు ఇక్కడ నుండి కూడా బియ్యం వెళు తున్నాయని, అలాగే కొందరు పూసర్ల కుటుంబీకులు చోడవరంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి దర్జాగా కట్టడాలు జరుపుకున్నారని దీనిపై కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు.

# నేటి నుండి చోడవరం మండల రెవెన్యూ సదస్సులు

చోడవరం పెన్ సత్తా డిసెంబర్5: మండలంలోని ఈనెల 6 నుండి వచ్చేనెల 8 వరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 వరకు, మరియు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామని రైతులు తమ తమ సమస్యలను రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకొస్తే అవకాశం ఉన్నంత వరకు పరిష్కరిస్తామని చోడవరం తాహసిల్దార్ అంబటి రామారావు, డిప్యూటీ తాహసిల్దార్ పొట్నూరి సత్యనారాయణ తెలిపారు. ఈనెల 6న శుక్రవారం వెంకన్నపాలెం గ్రామంలోనూ, 9న జన్నవరం, 10న బెన్న వోలు, 11న లక్ష్మీపురం, 12న అడ్డూరు, 13న రాయపు రాజుపేట, 16న జుత్తాడ, 17న దుడ్డుపాలెం, 18న ఉదయం గంధవరం, అదేరోజు మధ్యాహ్నం ఎం.కొత్తపల్లి గ్రామంలోనూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే 19న సీమనాపల్లి, 20న నర్సయ్యపేట, 21న ఉదయం అన్నవరం, మధ్యాహ్నం వెంకయ్యగారిపేట, 23న ఉదయం ఖండేపల్లి, మధ్యాహ్నం దామునాపల్లి, 24న ముద్దుర్తి, 26న తిమ్మనపాలెం, 27న చాకిపల్లి, 28న పిఎస్ పేట, 30న గవరవరం, 31న గౌరీపట్నం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే జనవరి 2న ఉదయం శ్రీరామపట్నం, మధ్యాహ్నం అంకుపాలెం, 3న ఉదయం గోవాడ, మధ్యాహ్నం భోగాపురం, 4న చోడవరంలోనూ, 6న లక్కవరం, 7న ఉదయం అంబేరుపురం, మధ్యాహ్నం గజపతినగరం, 8న మైచర్లపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తాహసిల్దార్ రామారావు, డిప్యూటీ తాహసిల్దార్ పొట్నూరి సత్యనారాయణ తెలిపారు

# మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు

మునగపాక పెన్ సత్తా డిసెంబర్ 5: రాష్ట్ర విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు డిసెంబర్ 7 వ తేదీ అనగా శనివారం మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ ను అత్యంత ఘనంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి డి. వేణు గోపాల రావు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం అన్ని పాఠశాలల్లో పండగ వాతావరణం లో పాఠశాల ఎస్ఎంసి సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలని, దీనిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని వేణు గోపాల రావు పిలుపునివ్వడమైనది. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లలచే స్వయంగా రూపొందించిన ఆహ్వాన పత్రికలను పంపి పాఠశాలకు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రగతిని చర్చించడానికి, వారి పురోభివృద్ధికి కృషి చేయడానికి, చక్కని ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ సమావేశం తోడ్పడుతుందని అయన పేర్కొనడమైనది. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని ఒక ప్రకటన ద్వారా వేణు గోపాల రావు కోరారు.

# టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన బుజ్జి రెడ్డి

చోడవరం పెన్ సత్తా డిసెంబర్5: స్థానిక కోపరేటివ్ కాలనీలో గల ఎల్ఐసి కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ జ్యోతిరావు బాబా పూలే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు చోడవరం లైన్స్ క్లబ్ ట్రెజరర్ డి.ఎస్.ఎన్ రెడ్డి (బుజ్జి రెడ్డి) స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జ్యోతిరావు స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థినీలు పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి తన సొంత సొమ్ముతో స్టడీ మెటీరియల్ కొనుగోలు చేసి బుజ్జిరెడ్డి అందజేశారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులను ప్రోత్సహించడానికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామని బుజ్జిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాల్గుణ, రమేష్ , ప్రిన్సిపల్ ఉష తదితరులు పాల్గొన్నారు.




# రెవిన్యూ సదస్సులను విజయవంతం చేయాలి రెవెన్యూ అధికారి బి. దయానిధి



అనకాపల్లి పెన్ సత్తా డిసెంబరు 5: రెవిన్యూ సదస్సులను విజయవంతం చేయుటకు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సహకారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులు వినియోగించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదు ఎక్కువగా వస్తున్నాయని, కావున గ్రామస్థాయి రెవెన్యూ సదస్సులో సమస్యలను పరిష్కారం చేసుకుంటే ప్రజలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. రెవిన్యూ సదస్సు లు డిసెంబరు 6 నుండి జనవరి 8 వ తేదీ వరకు జరుగుతాయని, సదస్సులు నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని, షెడ్యూల్ ను ప్రకటించడం జరిగిందని, షెడ్యూల్ ప్రకారం ముందుగా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. గ్రామంలో రీ-సర్వే చేసి ఉంటే, కొత్తగా తయారు చేసిన ఆర్ఓఆర్‌ను గ్రామంలో చదివి, అభ్యంతరాలు ఏవైనా ఉంటే పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నుండి డి పరమేశ్వర రావు, కొండబాబు, పి నాగేశ్వర రావు, బి అప్పారావు, ఐ ఎన్ సి పార్టీ నుండి మీసాల సుబ్బన్న, సిపిఎం పార్టీ నుండి గంటా శ్రీరామ్, పి వెంకన్న, బి రాజేంద్ర ప్రసాద్, జనసేన పార్టీ నుండి కె కనకరాజు, బి అప్పారావు, ఆప్ పార్టీ నుండి కె హరినాథ్ బాబు, స్వచ్ఛంద సంస్థల నుండి గాడి శ్రీను, గాడి బాలు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మృతిక దినోత్సవం కార్యక్రమం

## - మట్టి సంరక్షణ మన భవిష్యత్తుకు బంగారు పునాది






అనకాపల్లి పెన్ సత్తా డిసెంబర్ 5: ప్రపంచ మృతిక దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం అంతర్జాతీయ మృతిక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండల వ్యవసాయ అధికారి పి రంగాచారి మండల స్థాయి కార్యక్రమాన్ని మార్టూరు గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతులకు, విద్యార్థులకు మట్టి యొక్క విలువను, మానవ మనుగడకు, ఆహార ఉత్పత్తులకు ఏ విధంగా నేలలను సంరక్షించుకోవాలో తెలియజేస్తూ ముఖ్యంగా నేలలు ఆరోగ్యకరంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ఆహార ఉత్పత్తులను మానవాళికి సరిపడగా అందించవచ్చని రైతులకు తెలియజేసారు. నేలలు ఆరోగ్యకరంగా ఉండాలి అంటే పచ్చిరొట్ట పైరులను, అపరాలను సాగు చేసి నేలలో కలియు దున్ని నట్లయితే నేలలు సారవంతముగా ఏర్పడి పంటలకు అవసరమైన 15 రకాల పోషకాలను సమృద్ధిగా అందించి నాణ్యమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయుటకు దోహదపడుతుందని సూచించారు. అతిగా ఎరువులను, పురుగు మందులను వాడటం వల్ల నేలలు నిస్సారం అయ్యి పంటలు పండక పోవడం వల్ల, సరి అయిన ఆహారం దొరకడం జరగదని, పంటల ఉత్పత్తి తగ్గినట్లయితే రైతులు దిగుబడులు తగ్గి వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం వహించడం జరుగుతుందన్నారు. కాబట్టి రైతులకు నేలల యొక్క ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో మార్టూరు గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు కూడా నేలల పై అవగాహన, పోషకాల యొక్క విలువలను తెలియజెప్పడం జరిగింది. దీనివల్ల విద్యార్థి స్థాయి నుండి నేలల సంరక్షణ చేసినట్లయితే రాబోయే కాలంలో నేలలు క్షీణించకుండా రాబోయే తరాలకి ఆహారాన్ని అందించడం కోసం మన వంతు ప్రయత్నం చేద్దామని విద్యార్థులకు రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో హాజరైనటువంటి రైతులందరిని ఉద్దేశించి ప్రతి రైతు మొక్కలు విరివిగా పెంచాలని, తద్వారా సేంద్రియంగా నేలల్ని అభివృద్ధి పరచాలని, నీటి నిల్వలని పెంచాలని సూచించడమైనది. ఈ కార్యక్రమంలో మార్టూరు గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాస్, రవిరాజ్, ప్రవీణ, గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్ రైతులు పాల్గొనడం జరిగింది.

# వైసిపి నాయకులు బీజేపీ లోకి చేరిక




మునగపాక పెన్ సత్తా డిసెంబర్ 5: ఉమ్మలాడ గ్రామంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు సూచనలతో గ్రామ సర్పంచ్ సూరిసెట్టి గంగయమ్మ ఎస్ఆర్, బీజేపీ జిల్లా గౌరవ అధ్యక్షులు మొల్లేటి వాసు, మొల్లేటి జగది, పల్లి జ్యోతిష, సూరిశెట్టి శ్రీనివాసరావు, రామ కృష్ణ ఎస్ఆర్, మద్దాల రాము, కరోతి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు బిజెపిలో చేరారు. గురువారం గ్రామంలో బీజేపీ నాయకత్వం, ఎంపీ సీఎం రమేష్ విధానాలు, సిద్దాంతాలు నచ్చి పార్టీ లోకి వచ్చిన వైసిపి నాయకులను బీజేపీ పార్టీ జిల్లా గౌరవ అధ్యక్షులు మొల్లెటీ వాసు చేతుల మీదుగా బీజేపీ కండువాలు వేసి కాండ్రేగుల గణేష్, గుడే వెంకట గణేష్ ను పార్టీ లోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ గ్రామంలో వైసిపి నాయకులు బీజేపీ పార్టీ లో చేరాలని, రాష్ట్రంలో ప్రధాని, ఎంపీ సీఎం రమేష్ అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సూరిసెట్టి మోహన రావు, మలుగు అప్పలరాజు, దొమ్మేసి జగ్గారావు, భచ్చల నాగప్పరావు, మద్దల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

# నాదెండ్ల మనోహర్‌ను కలిసిన రాష్ట్ర మత్స్యకారుల నాయకులు



విశాఖపట్నం పెన్ సత్తా డిసెంబర్ 5: ఎయిర్ పోర్ట్ లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తో కలిసి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను శాలువా తో సత్కరించి పుష్ప గుచ్చం అందజేసిన రాష్ట్ర మత్స్యకార నాయకులు, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు. ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యల పై మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని చింతకాయల ముత్యాలు అన్నారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాల రావు, మెరిగి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.



# తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ ని కలిసిన రత్నాకర్

తిరుపతి పెన్ సత్తా: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా నియమితులైన బి ఆర్ నాయుడు ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా అనకాపల్లిలో నూకాభికా అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణ పనులను వివరించారు. అలాగే అనకాపల్లి లో ఉన్న ఇతర దేవాలయాల అభివృద్ధి పై చర్చించి అనకాపల్లికి రమ్మని ఆహ్వానించారు.



# సీసీ రోడ్డుకు శంఖుస్థాపన చేసిన కూటమి నాయకులు

పరవాడ పెన్ సత్తా డిసెంబర్ 5: మండలం లోని రావాడ గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ కాలనీ కి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు సహకారంతో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ లో గ్రాంట్ అయిన 35 లక్షలు సీసీ రోడ్డు కు శంఖు స్థాపన చేసిన కూటమి నాయకులు మోటూరు సన్యాసి నాయుడు(సర్పంచ్ ), వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు). గురువారం వీరు రోడ్డు పనులను కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో సారిపల్లి జోగి నాయుడు (మాజీ ఎంపీటీసీ), మోటూరు సూరిబాబు, పొలవరపు సంజీవ రావు, మామిడి మురళీ, దొప్ప ముసిలి నాయుడు, ద్వరపు రెడ్డి లింగ రాజు, మరిసా శ్రీను, పల్లా నాగేష్, శీరా నాగేష్, కర్రి శ్రీనివాస్( లైన్ మన్), శిరీష (పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి) గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



# జిల్లా రెవెన్యూ అధికారిగా వైఎస్వికెజిఎస్ ఎల్ సత్యనారాయణ రావు

అనకాపల్లి పెన్ సత్తా డిసెంబర్ 5: అనకాపల్లి జిల్లా రెవిన్యూ అధికారిగా వై ఎస్ వి కె జి ఎస్ ఎల్ సత్యనారాయణ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయన అన్నమయ్య జిల్లా రెవిన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా కు బదిలీ పై వచ్చారు.

# మాజీ మంత్రి అమర్నాథ్ దంపతులకు సత్కారం

చోడవరం పెన్ సత్తా డిసెంబర్5: మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ దంపతులను వైసిపి సీనియర్ నాయకులు, జడ్పిటిసి సభ్యులు దొండా రాంబాబు ఘనంగా సత్కరించారు. అమర్నాథ్ సతీమణి హిమ జన్మదిన వేడుకలు సందర్భంగా మర్యాదపూర్వకంగా దొండా రాంబాబు కలిసి ఆ దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేపీ అగ్రహారం గ్రామ సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## సంపాదకీయం

# లోటుపాట్లను సరిదిద్దాలి

ప్రజల మేలు కోరి ప్రభుత్వాలు అనేక పథకాలను చేపడుతుంటాయి. అయితే, వాటి అమలుకు షరతులు వర్తింపజేయడం, వివిధ రూపాల్లో ప్రతిబంధకాలు సృష్టించడం వల్ల లబ్ధిదారుల్లో చాలామందికి మేలు జరగట్లేదు. ఇలాంటి తరుణంలో ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జనారోగ్య యోజనను 70ఏళ్లు పైబడిన వారందరికీ వర్తింపజేస్తామని కేంద్రం ఇటీవల ప్రకటించింది. ఇది ఎంతవరకు అమలవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో 12 కోట్ల పేద కుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రధానమంత్రి జనారోగ్య యోజన (పీఎం–జేఏవై) ఆరంభించింది. దాని కింద ఈ ఏడాది నవంబరు ఒకటి వరకు 8.20 కోట్ల మంది ఆసుపత్రి ఖర్చులను భరించామని కేంద్ర ప్రభుత్వం ఘనంగా చెబుతోంది. కానీ, ఈ పథకం కింద నమోదైన ఆసుపత్రులు చికిత్స అందించడానికి నిరాకరించడమో, సవాలక్ష షరతులు పెట్టడమో చేస్తున్నాయి. దాంతో లబ్ధిదారులు ఏమాత్రం సంతృప్తిగా లేరు. మన అధ్వాన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను పీఎం–జేఏవై ఏమాత్రం మెరుగుపరచలేకపోయింది. ఆరోగ్య సేవలు వ్యాపారమయం అయిపోయాయి. చాలా ఆసుపత్రులు లాభాపేక్షతోనే పనిచేస్తున్నాయి. ఆరోగ్య బీమా సౌకర్యం లేకపోవడం, ఒకవేళ ఉన్నా అరకొర ప్రయోజనమే లభించడం వల్ల ప్రజలు వైద్యం కోసం పెద్దమొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. అలా ఎంతోమంది అలవికాని అప్పుల భారంతో దారిద్ర్యరేఖ దిగువకు జారిపోతున్నారు. ఈ దుస్థితి ఏటా ఏడు శాతం ప్రజలకు అంటే 10 కోట్ల మందికి దాపురిస్తోంది. ఇప్పుడు పీఎం–జేఏవై ద్వారా 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఆరోగ్య బీమా కల్పిస్తామనే కేంద్రం ప్రకటన వల్ల పరిస్థితి మారుతుందనే నమ్మకం కలగడం లేదు. అసలు 70 ఏళ్లు పైబడే వరకు ఆగడమెందుకు, 60 ఏళ్ల వయసు నుంచే వృద్ధుల ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయవచ్చు కదా? ప్రస్తుతం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు 60 ఏళ్ల లోపువారికి కూడా పింఛన్లు ఇస్తున్నాయి. కాబట్టి సీనియర్ పౌరులకు వర్తింపజేయదలచిన పీఎం–జేఏవైను 60 ఏళ్ల నుంచే మొదలుపెట్టాలనే డిమాండ్ బలంగా ముందుకొస్తోంది. ఇది కేంద్ర ప్రభుత్వానికి పెద్ద భారమేమీ కాదు. కానీ, 8.9 కోట్ల మంది వృద్ధులకు మాత్రం గొప్ప వరమే అవుతుంది. అసలు ఈ బీమా పథకం గురించి 68శాతం లబ్ధిదారులకు తెలియనే తెలియదు. అధికాదాయ వర్గాలకు చెందిన సీనియర్ పౌరులు దీన్ని ఎటూ వినియోగించుకోరు. ఏతావతా ఆరోగ్య బీమా కల్పించాల్సిన వృద్ధుల సంఖ్య తక్కువగానే ఉంటుంది. కాబట్టి ఆ మేరకు ఖర్చు కూడా తగ్గుతుంది. మరో సమస్య ఏమంటే, పీఎం–జేఏవై కింద నమోదైన ఆసుపత్రులు అర్హులైన లబ్ధిదారులకూ ఆరోగ్య సేవలు అందించడానికి నిరాకరించడం. వైద్యపరంగా అత్యవసర స్థితి ఏర్పడినపుడు ఆసుపత్రి వారు చికిత్స చేయడానికి నిరాకరిస్తే రోగి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. దీనివల్ల అనారోగ్యం మరింత ముదరవచ్చు. లేదంటే ప్రాణాలే పోవచ్చు. దీన్ని నివారించాలంటే నమోదిత ఆసుపత్రులన్నీ రోగులకు తప్పనిసరిగా చికిత్స అందించాలనే నిబంధన విధించాలి. ఇక తక్షణ చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన వృద్ధులను ఆరోగ్య కార్డు కోసం, ఇతర పత్రాల కోసం ఇబ్బంది పెట్టడం సరికాదు. దీన్ని నివారించాలంటే ఒక్క ఆధార్ కార్డుతోనే ఆసుపత్రిలో ప్రవేశం పొందే హక్కును కల్పించాలి. ఆధార్ కార్డుకే ఆరోగ్య బీమా పథకాన్ని అనుసంధానించి ఉంచాలి. రోగి ఎప్పుడెప్పుడు ఆసుపత్రి సేవలు పొందినదీ, అతడు లేక ఆమె ఆరోగ్య బీమా పథకంలో ఆ ఏడాది బ్యాలన్స్ ఎంత మిగిలి ఉందనే సంగతులను ఆధార్ ద్వారా తెలుసుకునే సౌకర్యం ఉండాలి. సీనియర్ పౌరులకు వర్తింపజేస్తామంటున్న ఆరోగ్య బీమా పథకంలో మరికొన్ని లోపాలున్నాయి. ఏడాదికి ఒక కుటుంబానికి రూ.5 లక్షల బీమా మాత్రమే కల్పిస్తామనడం మొదటి లోపం. కుటుంబంలో 70 ఏళ్లు పైబడినవారు ఒకరి కంటే ఎక్కువమంది ఉంటే బీమా మొత్తాన్ని అందరూ పంచుకోవాలి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 4.5 కోట్ల కుటుంబాల్లో 6 కోట్ల మంది సీనియర్ పౌరులున్నారు. ప్రస్తుతం వారికి వచ్చే అన్ని వ్యాధులకూ బీమా సౌకర్యం వర్తించదు. దీన్ని సరిదిద్దాలి. లేదంటే ఈ పథకం వట్టి కంటితుడుపు ప్రయోగంగానే మిగిలిపోతుంది. ప్రభుత్వం ఈ లోటుపాట్లను ప్రక్షాళించి సీనియర్ పౌరులకు పకడ్బందీగా ఆరోగ్య బీమా అందించాలి. సర్వజనులకూ ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడం సంక్షేమ రాజ్య లక్షణం. పౌరుల ప్రాణాలకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భరోసానిస్తున్న 21వ రాజ్యాంగ అధికరణను గౌరవించడం ప్రజాస్వామ్య ప్రభుత్వ విధి. నాణ్యమైన చికిత్స కోసం డిమాండ్ చేసే హక్కు ప్రజలకు ఉంది. అటువంటి చికిత్సను కొద్దిమందికి మాత్రమే పరిమితం చేయకుండా పౌరులందరికీ అందించడం ప్రభుత్వ బాధ్యత.

# అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసిన పోలీసులు



విజయనగరం పెన్ సత్తా డిసెంబర్ 5: జిల్లా తోటపాలెంలో నాలుగు ఇంళ్లలో ఆగష్టు మాసంలో దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన (అంతరాష్ట్ర) దొంగను గురువారం అరెస్టు చేసి, అతని వద్ద నుండి 400 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసినట్లుగా వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం పట్టణం తోటపాలెంలో ఆగష్టు 20 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు ఇండ్లలో దొంగతనాలకు పాల్పడినట్లుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుల్లో సాంకేతిక ఆధారాల ఆధారంగా నేరానికి పాల్పడిన మధ్యప్రదేశ్ రాష్ట్రంకు చెందిన ఐదా(ఈదు) బఘెల్ బుధవారం రాత్రి విజయనగరం పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సీసీఎస్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బృందం నిందితుడిని అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టారు. విచారణలో ఐదా ఆగస్టు మాసంలో తన గ్యాంగుతో మధ్యప్రదేశ్ నుండి విజయనగరం వచ్చి తోటపాలెం ప్రాంతంలో నాలుగు ఇండ్లలో దొంగతనాలకు పాల్పడినట్లుగా అంగీకరించారని వన్ టౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. అరెస్టు కాబడిన నిందితుడి వద్ద నుండి 400 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసి, రిమాండుకు తరలించినట్లు వన్ టౌన్ సిఐ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. నిందితుడి పై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులతో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నామని సిఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన ఎస్సై సురేంద్ర నాయుడు, హెచ్.సి.లు అచ్చిరాజు, శంకర రావు, ఇమ్రాన్ ఖాన్, కానిస్టేబుళ్లు శ్రీను, మణికంఠలను వన్ టౌన్ సిఐ శ్రీనివాస్, సీసీఎస్ సిఐ సత్యనారాయణలు అభినందించారు.

# ప్రశాంతంగా టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్




కాకినాడ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. 92.62 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌హన్ సగిలి తెలిపారు. ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీల్లో ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 16,737 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని పర్యవేక్షించేందుకు కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను కాకినాడ జెఎన్‌టియులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. కాకినాడ జిల్లా పిఠాపురం, శంఖవరం మండలాల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్ పరిశీలించారు. డిసెంబర్ తొమ్మిదిన ఓట్ల లెక్కింపు జరుగుతుందని అధికారులు తెలిపారు.

# 14 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

## - నిమ్మల రామానాయుడు



అమరావతి: సాగునీటి సంఘాలకు ఈ నెల 14 నుంచి ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ. సాగునీటి సంఘాలకు మూడు అంచెల్లో ఎన్నికలు జగుగుతాయన్నారు. తొలిరోజు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రెండో రోజు డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు , మూడో రోజు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత మేర ఏకగ్రీవంగా ప్రతినిధులను ఎన్నుకునే విధంగా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఈ సంఘాల విలువను గుర్తించకుండా రద్దు చేసిందని విమర్శించారు. ఫలితంగా గుండ్లకమ్మ, పులిచింత, అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయన్నారు.

# నాడు కేసులు వరకూ వెళ్లి.. నేడు నోరు మెదపరేం !

## - సెకితో ఒప్పందాలపై టిడిపిని నిలదీసిన షర్మిల - విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై ఎసిబికి ఫిర్యాదు




అమరావతి: సౌర విద్యుత్ ఒప్పందాల విషయంలో వైసిపి ప్రభుత్వం తప్పుచేస్తోందంటూ నాడు కేసులు కూడా దాఖలు చేసిన టిడిపి, ఇప్పుడు అధికారంలోకి వచ్చి కూడా మౌనంగా ఉండటాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) చీఫ్ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. అధిక ధరలకు సోలార్ విద్యుత్ కొనడం వల్ల ఒప్పందం చేసుకున్న మాజీ సిఎం జగన్‌కు నష్టం లేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబుకు నష్టం లేదని, రాష్ట్ర ప్రజలు మాత్రం 25 ఏళ్లలో రూ.లక్షన్నర కోట్లు నష్టపోవాల్సి వస్తుందని ఆమె అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కోర్టు కేసులు వేసిన టిడిపి నాయకులు ఇప్పుడు అధికారంలో ఉన్నా మౌనంగా ఉన్నారని తప్పుబట్టారు. సెకీతో విద్యుత్ ఒప్పందాలపై విజయవాడలోని ఎసిబి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఇనుప పంజరాన్ని ప్రదర్శిస్తూ ప్రభుత్వం ఎసిబిని పంజరంలో బందీని చేసిందన్నారు. అదానీపై అమెరికాలో దర్యాప్తు జరుగుతందని, సోలార్ పవర్ డీల్‌లో జగన్‌కి రూ.1750 కోట్లు ముడుపులు ఇచ్చారని అక్కడి దర్యాప్తు సంస్థ ఎఫ్‌బిఐ వెల్లడించిందన్నారు. ఇక్కడి దర్యాప్తు సంస్థలు మొద్దు నిద్రలో ఉన్నాయన్నారు. ఇంత అవినీతి జరిగితే అటు సిబిఐ, ఇటు ఎసిబి ఎందుకు బయటపెట్టలేకపోయాయని ప్రశ్నించారు. ప్రభుత్వం అదానీపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. ఆయన పేరు ఉచ్చరించడానికి సైతం భయపడతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎసిబిని పంజరంలో చిలుక మాదిరిగా బందీ చేసిందని చెప్పారు. ఈ దర్యాప్తు సంస్థను పంజరం నుంచి విడుదల చేయాలని కోరారు. లంచాల వ్యవహారంపై ఎసిబి దర్యాప్తు చేసి నిజాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. జగన్, చంద్రబాబు ఇద్దరూ ఒక్కటేనన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు. ఎసిబికి ఫిర్యాదు చేసిన వారిలో ఎపిసిసి నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజీ, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి తదితరులు ఉన్నారు.

# వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి జామియా మసీదు

డాబాగార్డెన్స్: చెంగల్రావుపేటలోని జామియా మసీదు నిర్మాణాలకు బ్రేక్ పడింది. హైకోర్టు, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు ఆదేశాలను అనుసరించి జామియా మసీదు కమిటీని రద్దు చేసినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ అహ్మద్ నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు జామియా మసీదు వద్ద నోటీసును అతికించారు. వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి జామియా మసీదు తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే మసీదు నిర్మాణం యథావిధిగా కొనసాగుతుందని, కానీ కమిటీకి ఇకపై ఎలాంటి అధికారాలు ఉండవన్నారు. మసీదు నిర్మాణం, అభివృద్ధికి అవసరమైన చందాలు, వితరణలు నోటీసులో పేర్కొన్న బ్యాంకు ఖాతా లేదా వక్ఫ్‌బోర్డు ఖాతాకు జమ చేయాలని, రశీదులను తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. కాగా.. అక్టోబర్ 17న జామియా మసీదు పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన సంగతి తెలిసిందే.

# ముందస్తు బెయిల్ ఇవ్వండి

## - వైవి సుబ్బారెడ్డి కొడుకు పిటిషన్

అమరావతి: బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌ల్లో తన వాటాల్ని లాక్కున్నారంటూ కర్నాటి వెంకటేశ్వర రావు (కెవి రావు) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ టిటిడి మాజీ చైర్మన్, ఎంపి, వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. వాటాల బదలాయింపు వ్యవహారంలో తన పాత్ర లేదని, తన తండ్రి రాజకీయ ప్రతిష్ఠను దిగజార్చేందుకు అధికార పార్టీ ప్రోద్బలంతో నాలుగున్నరేళ్ల తరువాత తప్పుడు కేసు పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వా నికి రూ.1000కోట్లు ఎగ్గొట్టారంటూ తనను ఇరికించారని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

# చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

నక్కపల్లి: పశువుల మేత కోసం చెట్టెక్కి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గొడిచెర్లలో జరిగింది. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అల్లు గంగరాజు(28) మేకలకు మేత కోసం పొలానికి వెళ్లాడు. అక్కడున్న వేప చెట్టు ఎక్కి వెదురుకు కత్తి కట్టి కొమ్మలు కొస్తుండగా వెదురు జారి పడి చేతికి గాయమైంది. దీంతో గంగరాజు చెట్టు పైనుంచి జారీ పడ్డాడు. తీవ్ర గాయాలు పాలైన ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కుని కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

# మట్టిని సంరక్షించుకోవాలి

## - జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

చోడవరం: ప్రతి రైతూ మట్టిని సంరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. వరల్డ్ సాయిల్ డే సందర్భంగా మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో మట్టి సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ మట్టిలో ఎటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలు కలవకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షలు నిర్వహించుకుని, ఆ ప్రకారం ఎరువులను మోతాదు మించకుండా వాడాలన్నారు. అనసర ఎరువులను వాడరాదని, అలా చేస్తే మట్టిలో ఉండే పంటలకు మేలు కలిగించే సూక్ష్మజీవుల సంఖ్య తగ్గి భూమి నిస్సారంగా మారి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే మట్టిని ఎంత ఆరోగ్యవంతంగా ఉంచుకుంటే అంత మంచిగా పండుతుందన్నారు. తద్వారా మానవజాతి కేన్సర్ వంటి రోగాలకు గురికాకుండా ఉంటుందన్నారు. పర్యావరణం సైతం కాలుష్యం కాకుండా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనా సేకరణ పద్ధతులను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. చోడవరం డివిజన్ వ్యవసాయ సహాయకుడు వి.రవీం?ద్రనాథ్, మండల వ్యవసాయాధికారి ఇ.పావని, వెంకన్నపాలెం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ మురుగుతి రమణ, మాజీ సర్పంచ్ బూర రమణ, గ్రామ ఉద్యాన సహాయకురాలు టి.మంజువాణి, వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

గోపాలపట్నం: హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకుండా డీలర్లు నూతన వాహనాలను డెలివరీ చేయవద్దని ఉపరవాణా కమిషనర్ జి.ఆదినారాయణ సూచించారు. మోటార్ వాహన చట్టం సెక్షన్ 41(6) ప్రకారం కొత్త వాహనాలు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరగడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ 2024 నవంబర్ 22న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రతి కొత్త వాహనం హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌తోనే ఉండాలని, ఈ నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కేసులు నమోదు చేస్తామ ని హెచ్చరించారు. ఈ ప్లేట్ల ఖర్చును వాహన ధరలో భాగంగానే వసూలు చేసుకోవాలని డీలర్లకు సూచించారు.

# వీఎంఆర్‌డీఏ మ్యూజియంల టికెట్ ధరలపై రాయితీ

మహారాణిపేట: కైలాసగిరిపైనున్న తెలుగు మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పరిధిలోని మ్యూజియంలలో ప్రవేశానికి విద్యార్థులకు టికెట్ ధరలో రాయితీ ఇవ్వనున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. గ్రూపుల వారీ సంబంధిత యాజమాన్యాల నుంచి లేఖ తీసుకొస్తే రాయితీ రేట్లు వర్తింపజేస్తామన్నారు. రివాల్వింగ్ కుర్చీలో కూర్చుని 40 నిముషాలు ఆస్వాదించే లైట్ అండ్ మ్యూజిక్ ప్రదర్శనకు గతంలో ఉన్న రూ.60 రుసుమును రూ.40గా నిర్ణయించామన్నారు. వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న అన్ని మ్యూజియంలలో ప్యాకేజీ పద్ధతిలో రాయితీ ధరలు వర్తిస్తాయన్నారు. ప్యాకేజీ–1లో కురుసుర, టీయూ–142, సీ హారియర్, తెలుగు మ్యూజియంలకు రూ.100, ప్యాకేజీ–2లో కురుసుర, టీయూ–142, సీహారియర్‌కు రూ.60, ప్యాకేజీ–3లో తెలుగు మ్యూజియం, టాయ్ ట్రైన్లకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# పౌల్ట్రీఫారంలో రేషన్ బియ్యం సీజ్



ఉండ్రాజవరం: వేలివెన్నులోని జోగిరాజు పౌల్ట్రీఫారంలో 1,836 కేజీల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... రేషన్ బియ్యాన్ని అక్రమంగా కోనుగోలు చేసి నూకగా ఆడించి కోళ్లకు మేతగా వాడుతున్నట్లు సమాచారం అందడంతో మండలంలోని పౌల్ట్రీలలో సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలివెన్నులోని జోగిరాజు పౌల్ట్రీఫారంలో 34 ప్లాస్టిక్ బ్యాగులలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. దీని విలువ రూ.79,866 ఉంటుందన్నారు. కోళ్ల ఫారం యజమాని ఎం.జోగిరాజు తండ్రి సుబ్బారావుపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం వేలివెన్ను గ్రామంలో రేషన్ షాపులను, ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. వాతావరణ పరిస్థితులు సరిగ్గా లేని కారణంగా వేలివెన్ను చుట్టుపక్కల గ్రామాల్లో రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని రైతులకు సూచించారు. తనిఖీలో సివిల్ సప్లయి డిప్యూటి తహసీల్దార్ సుధీర్ రెడ్డి, వెలివెన్ను వీఆర్వోలు మురళి, ఏసుపాదం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు



అరకులోయ: గంజాయి ఇస్తామని మోసగించిన వారితో పాటు గంజాయి కోనుగోలుకు ప్రయత్నించిన వారిని అరకులోయ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పాడేరు డీఎస్పీ ప్రమోద్ అరకులోయ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి ఇస్తామని చెప్పి మోసగించిన సంంఘటనలో నవంబర్ 27న మాడగడ గ్రామానికి చెందిన దినేష్‌కుమార్‌ను ముగ్గురు వ్యక్తులు కిడ్నాప్ చేశారని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అరకులోయ పోలీసులు కేసు నమోదు చేసి? దర్యాప్తు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఈ కేసును జిల్లా పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకోని అతి వేగంగా దర్యాప్తు చేసి వారం రోజుల్లోనే ఛేధించి దినేష్ కుమార్‌ను గుర్తించి, వారి కుటుంబ సుభ్యులకు అప్పగిం చామన్నారు. గుంటూరు పినుకొండకు చెందిన ట్యాక్సీ డ్రైవర్ షేక్ యాసీన్ అరకులోయకు వచ్చారు. ఇక్కడ ఉన్న దినేష్‌కుమార్, ప్రకాష్, సుశీల్ కుమార్‌తో పరిచయం పెంచుకున్నాడు. తరుచూ అరకులోయకు వస్తుంటానని తనకూ ఏమైనా అవసరం ఉంటే సహకరించాలని వారిని కోరాడు. ఈ నేపథ్యంలో సంతోష్ అనే వ్యక్తిని షేక్ యాసీన్ అరకులోయ పంపించి గంజాయి కావాలని కొంత నగదు, మరికొంత ఫోన్ ఫే ద్వారా చెల్లించాడు. దీనిని సుశీల్ కుమార్, ప్రకాష్ అంగీకరించారు. సదరు వ్యక్తి సంతోష్ నుంచి డబ్బులు తీసుకొని వారు సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారన్నారు. ఈ విషయాన్ని షేక్ యాసీన్‌కు ఫోన్ ద్వారా సంతోష్ సమాచారం అందించాడు. నాలుగు రోజుల అనంతరం సంతోష్ మరో వ్యక్తి అరకులోయ వచ్చి నగదు ఇచ్చిన సుశీల్ కుమార్, ప్రకాష్ ఫోన్ చేసినా వారు స్పందించలేదు. వారి కోసం అరకులోయలో గాలించారు. వారి ఆచూకీ దొరక్కపోవడంతో దినేష్‌కుమార్‌ని పట్టుకుంటే తమ డబ్బులు వస్తాయనే ఉద్దేశ్యంతో దినేష్ కుమార్‌ని కిడ్నాప్ చేశారన్నారు. ఒక లక్ష రుపాయలు ఇస్తే మీ అబ్బాయికి విడిచిపెడతామని దినేష్ కుమార్ తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వారి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు నిందితుల్లో షేక్ యాసీన్, సంతోష్ కుమార్‌లను అరెస్టు చేశామని, మరో నిందితుడు పరారీలో ఉన్నట్టు చెప్పారు. గంజాయి ఇస్తామని డబ్బులు తీసుకున్న ప్రకాష్, సుశీల్‌కుమార్ లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి అతి తక్కువ రోజుల్లో కేసు ఛేధించిన సీఐ హిమగిరి, అరకులోయ, డుంబ్రిగుడ ఎస్ఐలు గోపాలరావు, పాపినాయుడులను డీఎస్పీ ప్రమోద్ అభినందించారు.

# నౌకలో పీడీఎస్ బియ్యం తనిఖీకి 10మందితో బృందం



కాకినాడ: కాకినాడ లంగరు రేవులో నిలిపిన స్టెల్లా ఎల్ నౌకలోని కార్గోలో పీడీఎస్ బియ్యం గుర్తించిన నేపథ్యంలో నౌకలో ఉన్న మొత్తం బియ్యాన్ని తనిఖీ చేసేందుకు ఐదు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కూడిన ప్రత్యేక తనిఖీ బృందాన్ని నియమించామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ప్రకటనలో తెలిపారు. ఈ బృందంలో రెవెన్యూ, పౌరసరఫరాలు, పోలీస్, పోర్టు, కస్టమ్స్ శాఖలు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌ల నుంచి మొత్తం 10 మంది అధికారులను సభ్యులుగా నియమించామన్నారు. రెవె న్యూ శాఖ నుంచి పీవీవీ గోపాలకృష్ణ, పిఠాపురం తహ సీల్దార్, సివిల్ సప్లై కార్పొరేషన్ నుంచి టి.సత్యరాజ్, పి.నాగప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, పోలీస్‌శాఖ నుంచి ఎంవీవీ రవీంద్రనాథ్, ఎస్‌కే జానీబాషా సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఎంవీ ప్రసాద్, ఆర్.వెంకటేశ్వరరావు, పోర్టు కన్జర్వేటర్లు, కస్టమ్స్ డిపార్టుమెంటు నుంచి పి శ్రీధర్, సూపరింటెండెంట్ ప్రత్యేక తనిఖీ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ అధికారుల బృందం స్టెలా ఎల్ నౌకలో లోడ్ చేసి ఉన్న మొత్తం బియ్యాన్ని తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తుందన్నారు. బియ్యం తనిఖీ చేసేందుకు నియమించిన ప్రత్యేక బృందం కాకినాడ లంగరు రేవులో ఉన్న స్టెలా ఎల్ నౌకకు చేరుకుని అందులో ఉన్న బియ్యం తనిఖీ ప్రారంభించిందని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి




అనంతపురం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్ఈలు సంపత్‌కుమార్, సురేంద్రతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. జిల్లాలో విద్యుత్ మెటీరియల్ కొరత ఉందని, చాలా మంది డీడీలు చెల్లించి ఎదురు చూస్తున్నారని తెలిసిందని, 15 రోజుల్లో పరికరాలు సరఫరా చేస్తామని చెప్పారు. లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సైతం వేగవంతంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ సర్వీసుల కోసం రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రైతులు కోరిన సమయంలో విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ జేవీ రమేష్, ఏడీ శ్రీనివాసులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

గుంతకల్లు: పలు ప్యాసింజర్ రైళ్లకు కొత్త నంబర్లు కేటాయించినట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. హుబ్లీ–తిరుపతి స్పెషల్ ప్యాసింజర్ రైళ్లకు ప్రస్తుతం 07658/07657 నంబర్లు ఉండగా, వాటిని 57402/57401గా మారుస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు%–%చిక్‌జాజూర్ (07586/07585) స్పెషల్ ప్యాసింజర్ రైళ్లకు 57415/57416గా, తిరుపతి–కదిరిదేవరపల్లి (07589/07590) స్పెషల్ ప్యాసింజర్ రైలు నంబర్‌ను 57405/57406గా మార్పు చేస్తున్నట్లు వివరించారు. జనవరి 1 నుంచి కొత్త నంబర్లతో రైళ్లు రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు గుర్తించాలని సూచించారు.

# ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ



మహారాణిపేట: ఊహించని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో విపత్తుల నిర్వహణ, ఇతర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్, డీఆర్వో భవానీ శంకర్, ఇతర విభాగాల అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో శిథిలావస్థకు చేరిన వంతెనలు, తోతట్టు ప్రాంతాల్లో ఉండే కాలువలు, రిటైనింగ్ వాల్స్, తుపాను షెల్టర్లు, కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజల వివరాలను సేకరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలు, తుపాన్లు, అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని రకాల పరికరాలను, శిక్షణ, నైపుణ్యం కలిగిన సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు




పెదబయలు: రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వ పథకాలు అందించి ప్రోత్సాహిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ చెప్పారు. మండలంలోని గలగండ పంచాయతీ సిరసపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామస్తులు కలెక్టర్ ఆయనకు గిరిజన సాంప్రదాయంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల సేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గిరిజన ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గిరిజన రైతుల అభివృద్ధికి సహకారం: ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ దినేస్‌కుమార్ ముఖ్య అ?తి?థిగా పాల్గొని మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ప్రతీ గిరిజన గ్రామంలో ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన రైతుల అభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సహకారం అందిస్తాయన్నారు.రైతు ఉత్పత్తిదారులు సంఘాల సహకారంతో రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. జిల్లాలో కొత్తగా మరో 35 రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లో స్వచ్చంధ సంస్థలతో ఫోరం ఏర్పాటు చేశామని చెప్పారు.ఈ ఫోరంలో 64 స్వచ్చంధ సంస్థలు ఉన్నట్టు తెలిపారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు: జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్.నంద్ మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల సాగు పెరగాలన్నారు. చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. చిరుధాన్యాల సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. సుగాగ్ చిరుధాన్యాల చెల్లెళ్ల సంఘం చైర్‌పర్సన్ ఎం.విజయ మాట్లాడుతూ 250 మంది రైతులతో సంఘం ప్రారంభించామని ప్రస్తుతం 1130 మంది సభ్యులున్నట్టు చెప్పారు. ప్రతీ గ్రామంలో జీవ వైవిధ్య జాతరలను నిర్వహించి చిరుధాన్యాల సాగుపై చైతన్యవంతం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం కెవికె ఆధ్వర్యంలో లబ్దిదారులకు కోళ్లను పంపిణీ చేశారు.

కాఫీ తోటలను సందర్శించిన కలెక్టర్: సిరసపల్లి గ్రామ సమీపంలో ఉన్న కాఫీ తోటలను కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. కాఫీ రైతు కుంతూరు బొజ్జన్నతో మాట్లాడి కాఫీ సాగు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా పండిన కాఫీ పండ్లను మాత్రమే సేకరించాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మిరియాల సేకరణకు నిచ్చెనలు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. కొర్ర మత్స్యరాజు కుమార్తె భానుప్రియ సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతుందని, పింఛన్ మంజూరు బాధిత కుటుంబసభ్యులు కలెక్టర్‌ను విన్నవించారు. దీనిపై ఆయన స్పందించి, పింఛన్ కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అ?ధికారి ఎ.రమేష్‌కుమార్‌రావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం భాస్కరరావు, కాఫీ బోర్డు అధికారి సుదీప్, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో పూర్ణయ్య, ఎంఈవో పుష్ప జోసెఫ్, కె.వి.కె.శాస్త్రవేత్త రాజ్‌కుమార్, ఎంపీపీ బొండా వరహాలమ్మ, సర్పంచ్ లోయితాస్, సంస్థ సీఈవో టి.శాంతి, పీఆర్‌వో చైతన్య తదితరులున్నారు.

# పురాణ జ్ఞానంతో సంశయాల నివృత్తి



రాజమహేంద్రవరం: మన సంశయాలను పురాణాల ద్వారా నివృత్తి చేసుకోవాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అభిభాషించారు. పురాణాలు తెలిస్తే అన్ని సంశయాలు తొలగుతాయన్నారు. పురాణ ఇతిహాస గ్రంథాలు మనిషి కోసమే ఉన్నాయన్నారు. రాజవోలు గాయత్రీనగర్‌లోని రామాలయం దగ్గర శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి మంగళా శాసనాలతో అహోబిల రామానుజ జీయర్ స్వామి ఈ నెల 11వ తేదీ వరకు భాగవతంపై చేయనున్న ఆధ్యాత్మిక ప్రసంగాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు జరిగే ప్రవచనాలలో భాగంగా తొలిరోజు అహోబిల రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేసి భాగవత సప్తాహానికి శ్రీకారం చుట్టారు. వేదాల్లో సమస్తం ఉందని, అయితే వేదం చదివితే సరిపోదని దానర్థం తెలియాలని అన్నారు. వేదం అంటే కేవలం మంత్రాలని, వేదానికి శృతి అనే పేరు ఉందని, దీన్ని ఆధారం చేసుకుని ఋషులు స్మృతి ద్వారా అందులో అర్థాన్ని చెప్పారని, వాటిని స్మృతి గ్రంథాలు అంటారని తెలిపారు. వాటిని మరింత విస్తరించి ఇతిహాసాలు చెప్పారని వీటిని అనుసరించి రామాయణ, మహాభారతాలు, పురాణం, ఆగమం, ప్రబంధాలు వచ్చాయని, ఇవన్నీ వేదాన్ని, వేదంలో ఉండే అర్థాన్ని, వాటి వైభవాన్ని చెబుతాయని వివరించారు. మనిషి ఎలా ఉండాలో వివరించే మానవ ధర్మాలు వ్యాస మహర్షి ద్వారా పరమాత్మ చెప్పాడని అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. వ్యాసులవారు సాక్షాత్తూ విష్ణువు అవతారమని అన్నారు. ఎన్ని గ్రంథాల ద్వారా చెప్పినా మనుషుల్లో మార్పు రాకపోవడం వ్యాసుడు గ్రహించాడన్నారు. ఎందులోనూ దేవుని వైభవం పూర్తిగా చెప్పలేదని, పరమాత్మ గురించి సంకీర్తన చేయాలని, భగవంతుని గుణవైభవం వినేకొద్దీ మనిషి చాలా గొప్పవాడవుతాడని అందుకు తానే ఉదాహరణ అని నారదుడు ఉపదేశించాడని అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. అంతేకాదు, నాలుగు శ్లోకాలు చెప్పగా, వ్యాసుడు ఆనందించి, వాటి ఆధారంగా 18వేల శ్లోకాలు గల భాగవతాన్ని అందించాడని తెలిపారు. ఇదే మనం ఏడు రోజుల్లో వినబోతున్నామని అన్నారు. శ్రద్ధగా విని జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామివారి గోష్ఠి, బొమ్మూరు వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి



ఏయూక్యాంపస్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను తక్షణం ఆపాలని కోరుతూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌కే బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ప్రపంచ హిందువులంతా ఏకం కావాలని, ఇస్కాన్ స్వామీజీ చిన్మయ దాస్‌ను వెంటనే విడుదల చేయాలని నినదించారు. సమానత్వం, న్యాయం కోసం స్వామి చిన్మయదాస్ పోరాటం మహోన్నతమన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ ప్రభుత్వం హిందువులకు రక్షణ కల్పించకపోగా, చిన్మయదాస్ వంటి వారిని అరెస్టు చేయడం శోచనీయమన్నారు. దీనిపై మేధావులు, సెలబ్రిటీలు, మానవ హక్కుల కార్యకర్తలు వెంటనే స్పందించాలని కోరారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌ఎస్ఎస్ ప్రాంత సహ ప్రచారక్ జనార్దన్ మాట్లాడుతూ మానవ హక్కులను హరించేలా బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఉన్నాయన్నారు. చిన్మయదాస్‌ని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారత్ మాతాకీ జై నినాదాలతో బీచ్ రోడ్డు హోరెత్తింది. ప్లకార్డులు, కాషాయ జెండాలను పట్టుకుని పెద్ద సంఖ్యలో హిందూ సంఘాల సభ్యులు, మహిళలు, బీజేపీ నాయకులు, నగర వాసులు ర్యాలీలో పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు



**- ఆకస్మిక తనిఖీ చేసిన ఐటిడిఏ పిఒ సింహాచలం**

రంపచోడవరం: డివిజన్ కేంద్రమైన రంప చోడవరం ఏరియా ఆసుపత్రిలో అన్నిరకాల వైద్యసేవలు సమర్థవంతంగా రోగులకు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు రంప చోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ భావనతో కలిసి స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వివిధ రకాల భవనాలను పరిశీలించి, వేగవంతం చేయాలని ఆదేశించారు. డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి, రోజువారీ, నెలకు ఎంతమంది కిడ్నీరోగులకు డయాలసిస్ చేస్తున్నదీ ఆరా తీశారు.ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు రావడానికి కారణాలపై వైద్యాధికారులను ఆరా తీశారు. ఇక్కడ గిరిజనులు నీరు ఎక్కువగా తాగరని, అలాగే ఉప్పు, కారం ఎక్కువగావేసిన ఆహార పదార్థాలను తింటారని, అందుకు కిడ్నీలు పాడౌతున్నాయని వైద్యులు వివరించగా, దానిపై పిఒ స్పందిస్తూ, ప్రతిరోజూ సగటున ఐదు లీటర్లు నీరు తాగేలా గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రసూతి శిశు ఆరోగ్య నూతన భవనాన్ని పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో డ్రైనేజీ సిస్టం ఏర్పాటు, సెప్టిక్ ట్యాంకులు రెగ్యులర్‌గా పరిశుభ్రం చేయకపోవడం వల్ల నెలకొన్న ఇబ్బందులను ఆసుపత్రి సూపరెంటిండెంట డాక్టర్ టివి.శేషారెడ్డి పిఒ దృష్టికి తేగా, దీనికి సంబంధించిన ప్రతిపాదనను రూపొందించి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇబ్బందిలేకుండా వెంటనే వైద్యసేవలు అందించి, అవసరమైన మందులు ఇవ్వాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియా విభాగాన్ని పరిశీలించి, ఎంతమంది వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు, ఉచిత మందులు అందిస్తున్నదీ వివరాలపై ప్రశ్నించారు. ఇన్‌పేషెంట్లకు ఎప్పటికప్పుడు తాజా ఆహారం అందజేయాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణం పరిశీలించారు. కార్యక్రమలో డాక్టర్ ప్రేమ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య,. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖలో 6 నుండి జాతీయ గిరిజన యువ సమ్మేళనం




విశాఖపట్నం: విశాఖపట్నం కేంద్రంగా 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యువ అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు. బీచ్ రోడ్ లోనే వైఎంసిఏ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని గీతం యూనివర్సిటీ వేదికగా డిసెంబర్ ఆరు నుండి 12వ తేదీ వరకు జాతీయ గిరిజన యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో ఛతీష్ఘడ్ రాష్ట్రంలోని బస్తర్, కన్కర్, మోహల్లా జిల్లాలు ఒడిశాలోని కందమల్, కలహండి జిల్లాలకు చెందిన 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటారని చెప్పారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ సహకారాలతో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ద్వారా గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. వారం రోజులపాటు జరిగే ఈ గిరిజన యువ సమ్మేళనంలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రధానంగా గిరిజన సంస్కృతి–, ఆచారపు అలవాట్లు, భాష, విద్య,, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయని ఆయన వివరించారు. సమ్మేళనంలో భాగంగా రెండు రోజులు పాటు నగరంలోని సందర్శనీయ స్థలాలు, పరిశ్రమలు ఆధ్యాత్మిక కేంద్రాలను గిరిజన యువతకు చూపిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ సహకారాలతో కేంద్ర యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ద్వారా ఈ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. గిరిజనాభివృద్ధి కోసం భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు వాటి అమలు తీరని కూడా ఈ సమ్మేళనంలో వివరిస్తున్నట్లు మహేశ్వరరావు తెలిపారు.

# ప్రజలకు భారం లేకుండా విద్యుత్ కొనుగోళ్లు

**- మంత్రి గొట్టిపాటి రవికుమార్**



అమరావతి: ప్రజలకు భారం లేకుండా విద్యుత్ కొనుగోళ్లు ఉండాలని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లపాటు చేసిన చారిత్రాత్మక తప్పిదాలు ఇప్పుడు రాష్ట్రప్రజలకు గుదిబండగా మారాయని విమర్శించారు. రానున్న 6 నెలలకు సంబంధించిన విద్యుత్ డిమాండ్, సరఫరాల అంచనాలపై సంబంధిత అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ రంగానికి ఎటువంటి సమస్యలూ ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని డిమాండ్ మేరకు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పెరుగుతున్న విద్యుత్ డిమండ్‌కు తగ్గట్లుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ఎస్సి,ఎస్టి వినియో గదారులకు అందించే ఉచిత విద్యుత్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టా లని చెప్పారు. ఈ సమావేశంలో ఇంధన శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయా నంద్, జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరి, డిస్కంల సిఎండిలు ఐ పృధ్వీతేజ్, రవి పటాన్ సుభాష్, కె సంతోషరావు పాల్గొన్నారు.

# త్వరలో మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

**-సహకార సంఘాల ఎన్నికలకు కసరత్తు - మంత్రి అచ్చెన్నాయుడు**



గుంటూరు: రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను త్వరలో నియమిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరులోని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే రెండు దఫాలుగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని, త్వరలో మార్కెట్ కమిటీల నియామకాన్ని కూడా చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సహకార సంఘాలకు కూడా త్వరలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సహకార సంఘాలకు, రైతులకు సంబంధించిన వారు ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని అన్నారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. గుంటూరు మిర్చి యార్డులో రూ.350 కోట్ల వరకు నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విభాగం అధికారులు ఇటీవల నివేదిక ఇచ్చారని ఈ మేరకు బాధ్యులపై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు మిర్చి యార్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం 50 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న యార్డు ప్రాంగణాన్ని 200 ఎకరాల్లో స్థల సేకరణ చేసి విస్తరింపచేస్తామని వివరించారు.

# పరిశోధన రంగంలో నూతన ఆవిష్కరణపై అవగాహన




విశాఖపట్నం: పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పొందాలని ఏయు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయు కెమిస్ట్రీ విభాగంలో నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్మెంట్ (ఎన్ఎంఇసిఇ–2024) జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ శశిభూషణరావు మాట్లాడుతూ, ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రపంచవ్యాప్తంగా విస్తతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సును నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్ రాజు మాట్లాడుతూ, వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహదపడుతుందని చెప్పారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ఆచార్యులు డాక్టర్ జి.రఘు రామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నానో మెడిసిన్స్ ప్రభావంతంగా పనిచేస్తున్న విధానాన్ని తెలియజేశారు. విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశాన్ని అనుసంధానం చేస్తూ మూడు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల సదస్సులో భాగంగా ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడిటెక్ గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్.పురుషోత్తం, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆచార్య వి.సిద్దయ్య, ఆచార్య కె.బసవయ్య, ఆచార్య శైలజ తదితరులు ప్రసంగించారు. సదస్సులో దేశం నలుమూలల నుంచి ఆచార్యులు పరిశోధకులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరించిన 48 గంటల్లో నగదు చెల్లింపు

**- నాదెండ్ల మనోహర్**




ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం): రైతుల నుంచి ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే నగదు చెల్లింపులు చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆ శాఖ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆయన విశాఖపట్నం వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మంత్రి నాదెండ్ల విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1.51 లక్షల మంది రైతుల నుంచి 10.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. నేటికి రూ.2,331 కోట్లును రైతులకు చెల్లించామని తెలిపారు. కేవలం పది రోజుల్లో 6.63 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నామన్నారు.

రేషన్ మాఫియాపై ఉక్కుపాదం... పేదలకు అందాల్సిన బియ్యాన్ని విదేశాలకు తరలిస్తున్న మాఫియాపై తమ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని నాదెండ్ల తెలిపారు. రేషన్ బియ్యం తరలింపుపై చేసిన దాడులకు సంబంధించి 1,066 కేసులు నమోదు చేసి 729 మందిని అరెస్టు చేశామని, 102 వాహనాలను సీజ్ చేశామని వెల్లడించారు. అవసరమైతే పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తామని హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తున్న 62 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని, మార్కెట్ విలువ సుమారు రూ.240 కోట్లు ఉంటుందని తెలిపారు. రేషన్ మాఫియా చేసే అక్రమాల తీవ్రతను గుర్తించి సిబిసిఐడి విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. మూడేళ్లలో 1.31 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కాకినాడ పోర్టు నుంచి ఎగుమతయ్యాయని, అక్కడి ప్రాంతాన్ని స్మగ్లింగ్ డెన్‌గా తయారు చేసుకొని రాష్ట్రానికి, ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ వీరపాండ్యన్, ఎమ్‌డి మంజిల్ జిలానీ పాల్గొన్నారు.

# సముద్రంలో వేసిన పైప్ లైన్ తక్షణమే తొలగించాలి


**- రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు**



యు.కొత్తపల్లి: సముద్రతీరంలో ఫార్మా, బల్క్ కంపెనీలు వేస్తున్న పైపులైన్లు తక్షణమే నిలిపివేయాలని లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని మత్స్యకార నాయకులు తెలిపారు. కాకినాడ జిల్లా పొన్నాడ పంచాయతీ పరిధిలో ఉన్న కోనపాపేట రహదారిపై బేటాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్కార నాయకులు మాట్లాడుతూ సముద్ర తీరంలో ఫార్మా కంపెనీలు వేస్తున్న పైప్ లైన్లు ద్వారా సముద్ర జలాలు కలుషితమైతే మత్స్య సంపద అంతరించిపోతుందని రానున్న రోజుల్లో మత్స్యకారులుకు జీవనోపాధి ఉండదని తెలిపారు. పైప్లైన్లు తొలగించలేని పక్షంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి నెలకి 20000 అందుకోవాలని అలాగే మత్స్యకార కుటుంబాల్లో చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులకు ఆసుపత్రులు నియమించి ఉచితంగా వైద్యం అందించాలని అన్నారు. లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేసి సముద్రంలో వేస్తున్న పైప్ లైన్లు తొలగించడం జరుగుతుందని మత్స్యకారులు హెచ్చరించారు.

# కియాకు మరింత ప్రోత్సాహం

**- వైసిపి హయాంలో పరిశ్రమల్లో భద్రత కరువు - 34 మంది కార్మికులు మృతి : మంత్రులు వాసంశెట్టి, సవిత**



పెనుకొండ: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఏర్పాటు చేసిన కియా పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మరింత ప్రోత్సాహాన్ని అందిస్తామని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖలు, బిసి సంక్షేమ శాఖ మంత్రులు వాసంశెట్టి సుభాష్, సవిత అన్నారు. పెనుకొండ సమీపంలోని యర్రమంచి గ్రామం వద్ద ఉన్న కియా కార్ల పరిశ్రమను మంత్రి సవితతో కలిసి సుభాష్ పరిశీలించారు. కియా సిఇఒ కబ్ డాంగ్లీ, హెచ్ఒడిలు హాన్, మా, శాంగ్ జే, పాటిల్, సోమశేఖర్ రెడ్డి తదితరులు కియా సంస్థ గురించి మంత్రులకు తెలియజేశారు. కియా పిఆర్ఒ రాజశేఖర్ ఆధ్వర్యంలో పరిశ్రమ ద్వారా చేపట్టిన అభివృద్ధి, సిఎస్ఆర్ పనుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు తెలియజేశారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. కియా, ఆ పరిశ్రమ అనుబంధ సంస్థల్లో సుమారు 20 వేలమంది ఉపాధి పొందడం హర్షణీయమన్నారు. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పలు పరిశ్రమల్లో భద్రత లోపాల కారణంగా 34 మంది కార్మికులు మరణించారని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వసుధ మిశ్రా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కియాలో వసుధ మిశ్రా కమిటీ సందర్శించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఉపాధ్యాయుడిపై విద్యార్థి దాడి



రామభద్రపురం: మతిస్థిమితంలేని ఓ ఎనిమిదో తరగతి విద్యార్థి ఉపాధ్యాయుడిపై మారణాయుధంతో దాడి చేయడం కలకలం రేపింది. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలంలోని కొండ కెంగువ పంచాయతీ జుమ్మువలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సువ్వాడ అప్పలనాయుడుపై ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి వెంట తెచ్చుకున్న కత్తిపీటతో అకస్మాత్తుగా దాడి చేశాడు. స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న అప్పలనాయుడు మాస్టార్‌ను తానూ అటువైపే వస్తున్నానని, మీతో వచ్చేస్తాననడంతో రమ్మన్న ఉపాధ్యాయుడిపై దాడిచేశాడు. మాస్టారి తలపై కత్తిపీటతో దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటికే ఉపాధ్యాయుడు చలికాలం దృష్ట్యా మంకీ క్యాప్ పెట్టుకోవడంతో గాయాల తీవ్రత తగ్గిందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఉపాధ్యాయుడు పనిచేసిన ప్రాంతంలో విద్యార్థి అసభ్యకర మాటలు, ప్రవర్తనను ఇతర ఉపాధ్యాయులతో కలిసి అప్పలనాయుడు మాస్టారు కూడా వారించారు. సత్ప్రవర్తనతో మెలగాలని మందలించడాన్ని మనసులో పెట్టుకుని విద్యార్థి దాడికి పాల్పడ్డాడని భావిస్తున్నారు. ఇదే విషయమై అప్పలనాయుడు, ఆయన బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌లో పోలీసులపై కూడా ఆ విద్యార్థి దురుసుగా వ్యవహరించడంతో విద్యార్థి మానసిక స్థితి బాగాలేదని గుర్తించారు. అప్పటికే స్టేషన్‌లో విద్యార్థి కుటుంబసభ్యులకు విద్యార్థికి మానసిక చికిత్సలు అందజేయాలని ఎస్సై వెలమల ప్రసాదరావు సూచించారు. లేకుంటే మీపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వైశ్యరాజు జ్యూవెల్లరీ షోరూం ప్రారంభం



తుని: స్థానిక బాలాజీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన వైశ్యరాజు జ్యూవెల్లరీ షోరూంను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా సూర్యనారాయణ మొదటి కొనుగోలు చేశారు. అనంతరం షోరూంలోని ఆభరణాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తిలకించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొట్టమొదటిగా తునిలో షోరూం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను ప్లాట్ ఆరుశాతం తరుగుకే పొందవచ్చన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు లేదన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు, చెక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు పాల్గొన్నారు.

# విమాన ఇంధన పరిశ్రమ భూముల పరిశీలన



భోగాపురం: భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి విమాన ఇంధన పరిశ్రమను ఏర్పాటు చేయనున్న భూములను ఆర్టీఓ దాట్ల కీర్తి పరిశీలించారు. ఇంధన పరిశ్రమ ఏర్పాటుకు గత ప్రభుత్వం మండలంలోని అమటాం రావివలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 100, 101లలో హెచ్‌పీసీఎల్, జీఎంఆర్ సంస్థలకు సుమారు 7.8 ఎకరాలను కేటాయించింది. ఆ భూములను ఆర్డీఓ దాట్ల కీర్తి పరిశీలించి హద్దులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి కాబోతోందని, అందుకోసం విమానాలకు కావలిసిన ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఇంధన పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్, జీఎంఆర్ సంస్థలతో చేసుకున్న ఎంఓయూ ప్రకారం వారికి భూములను అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో ఆమె వెంట తహసీల్దార్ ఎం.సురేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, హెచ్‌పీసీఎల్, జీఎంఆర్ సంస్థల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గృహాల పనుల పరిశీలన



పాడేరు: మండలంలోని సలుగు పంచాయతీ పెద్దగరు గ్రామంలో పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణ పనులను పాడేరు హౌసింగ్ ఏఈ ఈ?శ్వర్ పడాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్పంచ్ అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు మీనా తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ ఓటర్లకు క్యాజువల్ లీవును మంజూరు చేసినట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

డుంబ్రిగుడ: ఫేషియల్ అటెండెన్స్ వేసేందుకు ఏజెన్సీలో కొన్ని పాఠశాలల్లో సిగ్నల్ పనిచేయని కారణంగా ఉపాధ్యాయులు హాజరుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించకుండా టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిగ్నల్స్ లేని కారణంగా, నెట్ ఫ్రీక్వెన్సీ సరిగా పనిచేయని కారణంగా చాలామంది ఉపాధ్యాయులు ఫేషియల్ అటెండెన్స్ వేసేకోవడానికి ఇబ్బంది పడుతున్నారని ఇది గ్రహించని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన షోకజ్ నోటీసుల వల్ల ఉపాధ్యాయులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని, ఆయా నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శెట్టి అప్పలరాజు, నాయకులు శ్రీను తదితరులున్నారు.

# నిర్లక్ష్య ధోరణితో ప్రతిష్టకు భంగం



టెక్కలి: ఎంతో పవిత్రమైన రావివలస ఎండల మల్లన్న దేవాలయ ప్రతిష్టకు భంగం కలిగేవిధంగా దేవదాయ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కార్తీక మాసోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలిగేలా తప్పిదాలు చేశారని బీజేపీ కార్యకర్తలు ఎస్.లక్ష్మీనారాయణ, సీహెచ్ లింగరాజు, జె.పరమేశ్వరరావు, జనసేన కార్యకర్త జనార్ధన్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మల్లన్న సన్నిధిలో జరిగిన కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా టికెట్లు, ఉచిత ప్రసాదాల పంపిణీలో చోటు చేసుకున్న తప్పిదాలపై పలు పత్రికల్లో కథనాలు, భక్తుల ఫిర్యాదుల మేరకు దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్‌తో పాటు ఇతర అధికారులు ఆలయంలో బుధవారం విచారణ చేపట్టారు. ప్రతిఏటా ఎంతో వైభవంగా జరిగే కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది భక్తులకు కనీసం ప్రసాదాలు సైతం అందివ్వలేని విధంగా ఉత్సవాలను నిర్వహించారని ఫిర్యాదుదారులు మండిపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాలు లేకపోవడంతో ఎంతో అసహనంగా వెనుదిరిగారని గుర్తు చేశారు. విచారణలో అధికారులు అన్ని వర్గాల నుంచి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, ప్రభాకరరావు, కోదండ, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, వీఆర్వో ఆర్.అప్పన్న, అర్చకులు రామకృష్ణ, మోహన్‌రావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పాడేరు: యోగాసనాలు ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికంగా, శారీరకంగా ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతాంజలి శ్రీనివాస్ గిరిజన బాలికలకు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థినులతోపాటు కలెక్టర్ కూడా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి యోగాసనాల ద్వారా అన్ని వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో యోగా అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లో యోగా శిక్షణ ఉంటుందన్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం అమ్మకాల ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం



బొబ్బిలి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎర్రచందనం వేలం అమ్మకాల ద్వారా అటవీ కార్పొరేషన్‌కు ఆదాయం లభిస్తోందని చైర్మన్ ఆర్‌వీఎస్‌కే రంగారావు అన్నారు. ఈ మేరకు ఆయన బొబ్బిలి కోటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం విదేశాల్లో ఎర్రచందనానికి మార్కెట్ మందకొడిగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాఖకు సంబంధించి ఆయనతో చర్చించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తామన్నారు. అడవుల్లో వాణిజ్య పంటలకు గిట్టుబాటు వ్యాపారం జరిగేలా నీలగిరి, కాఫీ తదితర పంటలను సాగు ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎర్రచందనం విక్రయాలకు ఏజెంట్‌గా కార్పొరేషన్ వ్యవహరిస్తోందని చెప్పారు. ఎకో టూరిజంకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనను అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో వారి సోదరుడు రామ్‌నాయ న, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు రౌతు రామ్మూర్తి నాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో అక్రమాలు సహించం



ఆమదాలవలస: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సివిల్ సప్లయ్స్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్ హెచ్చరించారు. ఆమదాలవలస మండలం జొన్నవలసలో ధాన్యం కొనుగోలు కేంద్రం, పట్టణంలోని శ్రీహరిపురం వద్ద పొట్నూరు సుందరరావుకు చెందిన రైస్ మిల్‌ను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లకు వెళ్లే ట్రక్ షీట్ మార్పులకు సంబంధించి పౌరసరఫరాల ఏఎస్ టెక్నికల్ శ్రీనివాసరావు నిర్వహణ తీరు, మిల్లర్లకు ఇప్పటి వరకు గన్నీలు అందించకపోవడంపై ఎండీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్టోడియన్లకు శిక్షణ అందించకపోవడంపై మండిపడ్డారు. ధాన్యం సేకరించిన వెంటనే మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐకు పంపించాలని మిల్లర్ రమేష్‌కుమార్‌కు సూచించారు. జాప్యం జరిగితే మిల్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బూర్జ మండలం డొంకలపర్త, పెద్దపేట గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు, రైస్ మిల్లులను సందర్శించారు. ధాన్యం తేమ పేరుతో తూకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రైస్ మిల్లు యజమానిని హెచ్చరించారు. కొలుగోలు కేంద్రంలో సిబ్బంది లేకపోవడంపై మండిపడ్డారు. రైతులను మభ్యపెట్టి అక్రమంగా ధాన్యం కొనుగోలు చేసే దళారులపై చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా సివిల్ సప్లయ్స్ డీఎం టి.వేణుగోపాల్, తహశీల్దార్ రాంబాబు, ఏవో మోహన్‌రావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

# చక్కెర ఫ్యాక్టరీ వ్యర్థాలతో ఇబ్బందులు



రేగిడి: మండలంలో ఏర్పాటు చేసిన సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం వ్యర్థపదార్థాలతో ఇబ్బందులు కలుగుతున్నాయని మండలంలోని పుర్లి గ్రామస్తులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ పక్క నుంచి తమ గ్రామానికి బీటీ రహదారి ఉందని, ఈ రహదారి మీదే ఫ్యాక్టరీ వ్యర్థాలు, చెత్తాచెదారం కుప్పలుగా పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులతో పాటు ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫ్యాక్టరీ యాజమాన్యం వాటిని తొలగించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మండల శానిటేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి, ఫ్యాక్టరీ యాజమాన్యంతో వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న రేగిడి పోలీసులు ఫ్యాక్టరీ వద్దకు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో పాటు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని పిలిపించి, వ్యర్థాలు తొలగించాలని సూచించారు.

# అనర్హులకు కేటాయించిన ఇళ్ల పట్టాలు వెనక్కి

**- రెవెన్యూ సదస్సుల్లో అక్రమాలు బయటకు - మంత్రి అనగాని సత్యప్రసాద్**



అమరావతి: గత ప్రభుత్వంలో అనర్హులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకుంటామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. వైసిపి కార్యకర్తలకు పెద్దయెత్తున ఇళ్ల పట్టాలను కట్టబెట్టినట్లు తెలుస్తోందన్నారు. అన్ని రకాల భూ వివాదాలకు పరిష్కారం చూపేందుకు ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 17,654 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుల నిర్వ హణ నేపథ్యంలో మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష నిర్వహించారు. 33 రోజులపాటు అన్ని గ్రామాల్లో ఈ సదస్సులు ఉంటాయని తెలిపారు. ఆ తర్వాత 45 రోజుల కాల వ్యవధిలో ఫిర్యాదులు పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన ఇంటి లబ్ధిదారుల జాబితాను వెల్లడించి అనర్హులను తేలుస్తామని, వారి నుంచి ఇంటి స్థలాన్ని వెనక్కి తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు కేటాయిస్తామని అన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుపైనా సదస్సుల్లో చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# షర్మిల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి




అనకాపల్లి: ఏఐసిసి అధ్యక్షురాలు, సొంత చెల్లెలు షర్మిలారెడ్డి వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక, కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తానంటూ జగన్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచి, ప్రజలపై రూ.72 వేల కోట్లు భారం మోపిన జగన్‌రెడ్డి, అప్పట్లో డిస్కంలకు రూ.11వేల కోట్ల బకాయిలను ఉంచేశారని, ఇపుడవి వినియోగదారులు తప్పక చెల్లించాల్సిన పరిస్థితిలో నిందను చంద్రబాబుపై మోపడం సరికాదన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్, వసతిదీవెన నిధులు రూ.3500 కోట్లు వైసిపి కాంట్రాక్టర్లకు బిల్లులుగా చెల్లించి, నేడు కూటమి ప్రభుత్వంపై అబద్దాల ఆరోపణలు చేయడం జగన్‌కే చెల్లిందని మండిపడ్డారు. దీంతో ఉన్నత విద్యావకాశాలకు దూరమౌతున్న బిటెక్ విద్యార్థులకు నాటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో పార్లమెంట్ కార్యనిర్వాక కార్యదర్శి కుప్పిలి జగన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ బోడి వెంకట్రావు, పార్లమెంట్ వాణిజ్య విభాగం సెక్రటరీ సాలాపు నాయుడు, అనకాపల్లి పార్లమెంట్ టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు దొడ్డి జగదీష్ పాల్గొన్నారు.

# ఆదర్శ్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన





పెందుర్తి: ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జివిఎంసి సహకారంతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అప్పలనాయుడు మాట్లాడుతూ, మైక్రో ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సమాజానికి ఎంత ప్రమాదకరమో వివరించారు. ప్లాస్టిక్ నిషేధంలో అందరి సహకారం అవసరమని తెలిపారు. జివిఎంసి ఎఎంహెచ్ఒ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వల్ల భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఈ రోజు నుంచి ఆదర్శ్ కాలేజీలో బ్యాన్ చేస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్ వెంకటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ 3 యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్స్ జి.మంజుల, డిఎస్.ప్రదీప్, ఎన్.సంధ్యారాణి, కళాశాల సిబ్బంది, జివిఎంసి సిబ్బంది విఎస్.నాయుడు, డి.నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రజక వృత్తిదారులకు ఉపాధి రక్షణ కల్పించాలి




మాధవధార: ఆంధ్రప్రదేశ్‌లో రజక వృత్తిదారులకు ఉపాధి రక్షణ కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మడక రాజు డిమాండ్ చేశారు. కంచరపాలెం హైవేలోని బొట్టా నర్సింగరావు భవనంలో ఎపి రజకవృత్తిదారుల సంఘం విశాఖ జిల్లా మహాసభలు పివి.రమణ, ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు రాష్ట్ర కమిటీ నుంచి ఎం.రాజు పరిశీలకులుగా హాజరై మాట్లాడుతూ, రజక వృత్తిదారులకు గత 30 ఏళ్లుగా ప్రభుత్వాలు అన్నివిధాలా ద్రోహం చేస్తున్నాయన్నారు. బిసి సంక్షేమమే ధ్యేయమని వచ్చే ప్రభుత్వాలన్నీ మాటలు చెబుతున్నాయని విమర్శించారు. నిధులు కేటాయించని బిసి కార్పొరేషన్ ఎందుకని ప్రశ్నించారు. గతంలో కార్పొరేషన్ నుంచి వృత్తికి లోన్లు, సబ్సిడీలు అమలయ్యేవని గుర్తుచేశారు. నేడు ఎన్నికల్లో వృత్తిదారులను వాడుకుంటున్నారు తప్ప ఎటువంటి సంక్షేమ పథకాలూ అమలు కావటం లేదన్నారు. దోబీఘాట్లు కొత్తవి ఏర్పాటు, ఉన్నవాటికి నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించే పని చేయడంలేదన్నారు. విశాఖపట్నంలో 50 వేల మంది రజకవృత్తిదారులు గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇళ్లల్లో పాచిపనులు, వాచ్‌మ్యాన్‌లు, బిల్డింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారని, వీరికి ఎటువంటి రక్షణా లేదన్నారు. పనిప్రదేశాల్లో, నివాసప్రాంతాల్లో అవమానాలకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రజకవృత్తిదారులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మూడేళ్లలో చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరిస్తూ భవిష్యత్తు మూడేళకలకు ప్రణాళికను ప్రకటించారు. రజక వృత్తిదారులకు ఏ సమస్య వచ్చినా ఎపి రజకవృత్తిదారుల సంఘం (ఆర్‌విఎస్) అండగా నిలిచిందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల వృత్తిని కోల్పోవల్సి వస్తోందన్నారు. రజక వృత్తిదారులకు బిసి కార్పొరేషన్ నుంచి రుణాలు మంజూరు చేయాలని, బొగ్గు ఉచితంగా సరఫరా చేయాలని, పిల్లల విద్యకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని, దోబీఘాట్‌లకు ఉచిత కరెంటు సదుపాయం కల్పించాలని, 50ఏళ్ల వయస్సు వారికి ప్రభుత్వ పెన్షన్ ఎటువంటి నిబంధనలు లేకుండా అమలుకోసం భవిష్యత్తు ఉద్యమాలు చేపడతామని తెలిపారు.నూతన కమిటీ ఎన్నిక ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పట్నాల వెంకటరమణ, మల్లేశ్వరపు ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బైరిశెట్టి ఆనందరావు, సహాయ కార్యదర్శిగా మడక రమణ, కోశాధికారిగా ఎం.విజరుకుమార్‌తో పాటు మరో 7గురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# యూపీఐ యూజర్లకు గుడ్‌న్యూస్.. లైట్ వాలెట్ పరిమితి రూ.5వేలకు పెంచిన ఆర్‌బీఐ




యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే యూజర్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. యూపీఐ లైట్ వాలెట్ పరిమితిని రూ.5వేలకు పెంచడంతో పాటు ప్రతి రూ.1000 వరకు గరిష్ఠంగా చెల్లింపు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. యూపీఐ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను మరింత ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. యూపీఐ లైట్ ద్వారా.. మొబైల్‌లో ఇంటర్‌నెట్ అందుబాటులో లేకపోయినా చెల్లింపులు చేసుకునేందుకు వీలుంటుంది. అంటే ఆఫ్‌లైన్‌లోనూ చెల్లింపులు చేయొచ్చన్నమాట. ఈ మేరకు 2022 జనవరిలో జారీ చేసిన ఆఫ్‌లైన్ ఫ్రేమ్‌వర్క్ నిబంధనలను ఆర్‌బీఐ సవరించింది. అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథెంటికేషన్ అవసరం లేనంత వరకు ఆఫ్‌లైన్ విధానంలో చెల్లింపులు జరుగుతాయి. పరిమితి తర్వాత తిరిగి వ్యాలెట్‌లో నగదు జమ చేసుకునేందుకు ఏఎఫ్ఏ ద్వారా ఆన్‌లైన్ మోడ్‌లో మాత్రమే చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. యూపీఐ లైట్ అనేది యూపీఐ పిన్ అవసరం లేకుండా తక్కువ మొత్తంలో జరిపే లావాదేవీలకు అనుమతించే వ్యాలెట్. ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ పే కారణంగా డిజిటల్ చెల్లింపుల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రస్తుతం చెల్లింపులను మరింత విస్తరించేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటున్నది.

# ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌దే హవా



న్యూఢిల్లీ: దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లకు చెందిన ఆఫీస్ స్పేస్ 526 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నదని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ మంగళవారం తెలిపింది. 'రీట్స్: రీషేపింగ్ ఇండియాస్ కమర్షియల్ స్పేస్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. ఈ స్టాక్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లుగా ప్రకటించింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా నగరాల్లో మొత్తం 884.1 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఏ కార్యాలయ స్థలాలున్నాయని వెస్టియన్ డాటా చెప్తున్నది. ఇందులో రీట్స్‌కు చెందినదే 526.3 మిలియన్ చదరపు అడుగులని, దీని విలువ రూ.4.5 లక్షల కోట్లు అని స్పష్టం చేసింది. దీనిలో స్టాక్ మార్కెట్లలో నమోదైన రీట్స్‌ల్లో మూడింటికి చెందినదే 110.7 మిలియన్ చదరపు అడుగులుగా ఉందని వివరించింది.

హైదరాబాద్ టాప్: ఆయా నగరాలపరంగా చూస్తే.. హైదరాబాద్‌లోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో దాదాపు 74 శాతం రీట్స్ ఆధ్వర్యంలోని ఆఫీస్ స్పేసే కావడం గమనార్హం. అలాగే ముంబై, పుణెల్లోగల ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌కు చెందినదే 50 శాతం. అయితే ఈ విషయంలో 24 శాతంతో కోల్‌కతా ఆఖర్లో ఉన్నట్టు వెస్టియన్ తెలియజేసింది. ఇక ఈ ఏడు ప్రధాన నగరాల్లో రీట్స్‌కున్న ఆఫీస్ స్పేస్‌లో 60 శాతానికిపైగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనే ఉన్నది. ఇదిలావుంటే భారతీయ రీట్ సంస్థల్లో 4 మాత్రమే స్టాక్ మార్కెట్లలో నమోదయ్యాయని, వీటి ఆధ్వర్యంలో అటు రిటైల్, ఇటు ఆఫీస్ మార్కెట్లలోని స్పేస్ 125 మిలియన్ చదరపు అడుగులని వెస్టియన్ ఈ సందర్భంగా తెలిపింది.

# జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్




హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రి తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# కొనసాగుతున్న రుపీ పతనం




ముంబై: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కని ష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుపీ-డాలర్ రేటు 64.65-84.76 స్థాయిలో కదలాడింది.

## యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

# సత్తాచాటిన సూర్యవంశీ

షార్జా: ప్రతిష్ఠాత్మక అండర్-19 ఆసియా కప్‌లో యువ భారత్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)పై ఘన విజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 138 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని యువ భారత్ 16.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 143 పరుగులు చేసింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ(46 బంతుల్లో 76 నాటౌట్, 3ఫోర్లు, 6సిక్సలు), ఆయూశ్ మాత్రె(51 బంతుల్లో 67 నాటౌట్, 4ఫోర్లు, 4సిక్సలు) అజేయ అర్ధసెంచరీలతో కదంతొక్కారు. ఐపీఎల్‌లో 1.10 కోట్ల ధర పలికిన 13 ఏండ్ల సూర్యవంశీ అంచనాలకు అనుగుణంగా సత్తాచాటాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో విఫలమైన సూర్యవంశీ యూఏఈపై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తొలుత యూఏఈ 44 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటైంది. రయాన్ (35), అక్షత్(26) రాణించగా, మిగతా వారు ఘోరంగా విఫలమయ్యారు. ఆయూశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.




# శాంతి భద్రతల పరిరక్షణలో డ్రోన్లు కీలకం




అమలాపురం: శాంతి భద్రతల పరిరక్షణలో డ్రోన్ల అవసరం పెరుగుతోందని, పోలీసులందరూ వాటి వినియోగం, పనితీరుపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో డ్రోన్లపై శిక్షణ నిర్వహించారు. వీటికి జిల్లాలోని 25 పోలీసు స్టేషన్ల నుంచి ఒక్కొక్క కానిస్టేబుల్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ బహిరంగ సభలు, గొడవలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగే సంఘటనలు జరిగినప్పుడు డ్రోన్ల కెమెరాలను ఉపయోగించాలన్నారు. వీటి వల్ల ఒకే చోట నిలబడి ఆ ఘటనను పరిశీలించే అవకాశం ఉంటుందని, నేరస్తులను సులభంగా గుర్తించవచ్చన్నారు. డ్రోన్లు లేనప్పుడు ఈ విధుల నిర్వహణకు అనేక మంది పోలీసులు పని చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు డ్రోన్ కెమెరాలను గాలిలోకి పంపి, ఆద్యంతం పరిశీలించే పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతానికి జిల్లాలోని మూడు పోలీస్ సబ్ డివిజన్లకు ఒక్కో డ్రోన్ పరికరం మంజూరు చేశారన్నారు. భవిష్యత్తులో 25 పోలీసు స్టేషన్లకు ఒక్కో యంత్రం ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. శిక్షణలో జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, జిల్లా సోషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ ఆర్ఐ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# ఎంజేపీలో స్పోర్ట్స్ మీట్ షురూ

హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురుకుల సొసైటీ పరిధిలోని జగదేవ్‌పూర్ బాలికల పాఠశాలలోని సూల్ అండ్ కాలేజ్‌లో బాలికలకు ఏర్పాటు చేసిన నాలుగు రోజుల స్పోర్ట్స్ మీట్‌ను సెక్రటరీ సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభాపాటవాలు వెలుగులోకి రావడానికి స్పోర్ట్స్ మీట్లు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈ ఏడాది 12 మంది ఎంజేపీ విద్యార్థినిలు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని సంతోషం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో అథ్లెటిక్స్, రన్నింగ్, కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్ లాంటి క్రీడలకు సంబంధించి అండర్ 14, 17,19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, మొత్తంగా 1400 బాలికలు, 1400 బాలురు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.




# బియ్యం ఎగుమతి మూలాల ధ్రువీకరణలో మా పాత్ర లేదు




కాకినాడ: విదేశాలకు ఎగుమతి చేసే బియ్యం మూలాలను ధ్రువీకరించడంలో తమ శాఖ పాత్ర లేదని కస్టమ్స్ కమిషనర్ (విజయవాడ) సాధు నరసింహారెడ్డి తెలిపారు. కస్టమ్స్ నోటిఫైడ్ ఏరియాలోకి బియ్యం ప్రవేశించిన తర్వాత కస్టమ్స్ పాత్ర ప్రారంభమవుతుందన్నారు. కమిషనర్ నరసింహారెడ్డి కాకినాడ కస్టమ్స్ హౌస్‌ను సందర్శించారు. అనంతరం అధికారులు, వ్యాపారులతో వివిధ సమస్యలపై చర్చించారు. కొత్తగా అమల్లోకి వచ్చిన సీకార్గో మేనిఫెస్టో, ట్రాన్స్‌షిప్‌మెంట్ రెగ్యులేషన్స్ (ఎస్-సీఎంటీఆర్)-టెక్నికల్, సీబీఎల్ఎంఎస్ పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను వాణిజ్య ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై వ్యాపారవేత్తలకు త్వరలో శిక్షణ ఏర్పాటు చేస్తామని కమిషనర్ చెప్పారు. పీడీఎస్ బియ్యం ఎగుమతి సమస్యపై కూడా కమిషనర్ చర్చించారు. రైస్ ఎక్స్‌పోర్టర్స్ సంఘం అధ్యక్షుడు బీవీ కృష్ణారావు మాట్లాడుతూ.. తాము చట్టాన్ని గౌరవిస్తున్నామని, ఎగుమతి కోసం పీడీఎస్ బియ్యాన్ని మళ్లించే ఎటువంటి కార్యకలాపాలకు తమ సంఘం మద్దతు ఇవ్వదన్నారు. చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ బియ్యం ఎగుమతిపై స్పష్టత వచ్చే వరకు తెల్ల బియ్యం ఎగుమతి నిర్వహణను వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నామన్నారు. కాకినాడ కస్టమ్స్ అదనపు కమిషనర్ జి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ కాకినాడ కలెక్టర్ జూలై 31 ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పోర్టు ఏరియాలో ఆగస్టు 5 నుంచి పోలీసు, పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారుల ద్వారా పనిచేసేలా సమీకృత చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. పోర్టులోకి వచ్చే వాహనాలను తనిఖీ చేయించుకుని ఎగుమతిదారులు పౌర సరఫరాల ఎన్ఓసీ తీసుకోవాలన్నారు. పౌర సరఫరాల శాఖ చేస్తున్న ప్రయత్నాలకు సహకరించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. పీడీఎస్ బియ్యం మళ్లింపు సహా ఏదైనా ముప్పును అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు కస్టమ్స్ విభాగం కట్టుబడి ఉందన్నారు. విశాఖపట్నంలో రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్స్, వ్యాపారవేత్తలతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్లు ఎన్.రవికుమార్, జీఎస్ఆర్ నాయుడు, కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ బి.మహేష్‌బాబు, కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ వీవీ రాఘవులు, కాకినాడ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

# సీఎం కప్ జెర్సీ ఆవిష్కరణ

హైదరాబాద్: గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేసే ఆలోచనతో తీసుకురాబోతున్న సీఎం కప్ టోర్నీకి రంగం సిద్ధమవుతున్నది. బుధవారం పెద్దపల్లిలో సీఎం కప్ జెర్సీ, బ్రౌచర్, ట్రోఫీని సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ఆవిష్కరించారు. ఈనెల 7 నుంచి జనవరి 2వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో దాదాపు 36 క్రీడాంశాల్లో పోటీలు జరుగనున్నాయి. టోర్నీలో పోటీపడే ప్లేయర్లు సీఎం కప్ గేమ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(జీఎంఎస్) ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీబాలదేవి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# 15 ఏండ్ల తర్వాత




కింగ్‌స్టన్: వెస్టిండీస్ గడ్డపై బంగ్లాదేశ్ జట్టు 15 ఏండ్ల తర్వాత చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. విండీస్‌తో ముగిసిన రెండో టెస్టులో బంగ్లా 101 పరుగుల తేడాతో భారీ గెలుపు అందుకుంది. బంగ్లా నిర్దేశించిన 287 పరుగుల లక్ష్యఛేదనలో విండీస్ 185 పరుగులకే కుప్పకూలింది. తైజుల్ ఇస్లాం(5/50) ధాటికి విండీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. కొవెమ్ హాడ్జ్(55), కెప్టెన్ క్రేగ్ బ్రాత్‌వైట్(43) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. హసన్, తస్కిన్ రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. అంతకుముందు ఓవర్‌నైట్‌స్కోరు 193/5తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన బంగ్లా 268 పరుగులు చేసింది. జాకెర్ అలీ(91) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు.

# మూల్యాంకనంలో పొరపాట్లకు తావివ్వరాదు

నరసరావుపేట: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా డిగ్రీ మూల్యాంకనం నిర్వహించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూజీ కో%-%ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి.కృష్ణారావు తెలిపారు. వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వర్సిటీ డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని డాక్టర్ కృష్ణారావు సందర్శించారు. కళాశాలలోని మూల్యాంకన కేంద్రం స్ట్రాంగ్ రూమ్, జవాబు పత్రాల పంపిణీ గది, అధ్యాపకులకు కల్పించిన వసతులు స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూల్యాంకనంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని చెప్పారు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం కొనసాగాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



# భారత్ హ్యాట్రిక్




మస్కట్: ప్రతిష్ఠాత్మక జూనియర్ ఆసియాకప్‌లో యువ భారత్ దుమ్మురేపింది. కుర్రాళ్లు కొదమసింహాల్లా కదంతొక్కారు. డిఫెండింగ్ చాంపియన్ హెూదాకు న్యాయం చేస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో భారత్‌త 5-3తో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయదుందుభి మోగించింది. వరుసగా మూడోసారి టైటిల్‌ను ఒడిసిపట్టుకుని హ్యాట్రిక్‌ను ఖాతాలో వేసుకుంది. ఆఖరి వరకు హెూరాహెూరీగా సాగిన తుది పోరులో యువ భారత్ తరఫున అరైజీత్‌సింగ్ హుండల్ ఏకంగా నాలుగు గోల్స్(4ని, 18ని, 47ని, 54ని) చేయగా, దిల్‌రాజ్‌సింగ్(19ని) మరో గోల్ నమోదు చేశాడు. సుఫియాన్ ఖాన్(30ని, 39ని), హన్నన్ షాహిద్(3ని) పాకిస్థాన్‌కు గోల్స్ అందించారు. మూడో స్థానం కోసం వర్గీకరణ పోరులో జపాన్ 2-1తో మలేషియాపై విజయం సాధించింది. భారత్, పాక్ ఫైనల్ పోరు రసవత్తరంగా సాగింది. ఇరు జట్లు తొలి క్వార్టర్‌లో బంతిపై పట్టు సాధించేందుకు బాగా ప్రయత్నించాయి. అయితే మ్యాచ్ 3వ నిమిషంలో హన్నన్ గోల్‌తో పాక్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. నిమిషం వ్యవధిలోనే దక్కిన మొదటి పెనాల్టీ కార్నర్‌ను అరైజీత్ గోల్ చేయడంతో స్కోరు 1-1తో సమమైంది. ఇదే దూకుడు రెండో క్వార్టర్‌లో కొనసాగించిన భారత్‌కు 18వ నిమిషంలో అరైజీత్ గోల్‌తో పాటు దిల్‌రాజ్ గోల్‌తో ఆధిక్యం 3-1కి చేరింది. మూడో క్వార్టర్‌లో పుంజుకున్న పాక్ 30వ నిమిషంలో సుఫియాన్ గోల్‌తో పోటీలోకి వచ్చింది. 47వ నిమిషంలో అరైజీత్ ఫీల్డ్ గోల్‌తో మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించింది. మ్యాచ్ మరో 10 నిమిషాల్లో ముగుస్తుందనగా దక్కిన పెనాల్టీ కార్నర్లను భారత్ గోల్స్‌గా మలువడంతో పాక్‌పై విజయం ఖరారైంది.

# అంతర్రాష్ట్ర వాహన చోరుడి అరెస్ట్



లక్ష్మీపురం: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు చేసినట్లు వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీలు తెలిపారు. గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వారు కేసు వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి సుమారు రూ. 8 లక్షల విలువ చేసే వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారి కథనం ప్రకారం... పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణం, పురుషోత్తంపట్నానికి చెందిన వల్లెపు సత్యదాసు చెడు వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్నాడు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో పలు చోరీలు చేశాడు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ (క్రైం) కె.సుప్రజ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. సుమారు 150 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేశామని, వాహనాలను నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో వీఐపీ రోడ్డు చివర విక్రయిస్తున్నాడనే సమాచారంతో బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన గుంటూరు జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ, సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, వెస్ట్ డీఎస్పీ బి.ఎం.జయరామ్‌ప్రసాద్, నగరంపాలెం పీఎస్ సీఐ వీరానాయక్, సీసీఎస్ సీఐ ఎం.వి.సుబ్బారావు, నగరంపాలెం ఎస్సై షేక్ సలాం, సీసీఎస్ ఎస్సై ఎల్.రాములు, ఏఎస్సై కృష్ణస్వామి, హెచ్‌సీ విజయ్‌కుమార్, పీసీలు శ్రీక్రాంత్, షేక్ నజీర్, నగరంపాలెం సిబ్బంది పీసీలు ప్రేమకుమార్, క్రాంతి, వసంతరావు నాయక్‌లను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందనలు తెలిపారని చెప్పారు.

"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com